




# విజయభాను

హైదరాబాద్, బుధవారం 30-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 348 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## పీవీ సింధుకు గవర్నర్ అభినందనలు



హైదరాబాద్ : ప్రపంచ బ్యాడ్మింటన్‌లో రజతం సాధించిన పీవీ సింధుకు గవర్నర్ నరసింహన్ అభినందనలు తెలియజేశారు. సింధు భవిష్యత్‌లోనూ అనేక పతకాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు. గవర్నర్ తో పాటు సింధుకు పలువురు ప్రముఖులు అభినందనలు చెప్పారు.

**భారత స్టార్ షట్లర్ సింధు...**

దేశ బ్యాడ్మింటన్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఆదివారం ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకంతో సంచలనం సృష్టించింది. హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగోసీడ్ సింధు 19-21, 22-20, 20-22తో ఏడోసీడ్ నొజామి ఒకుహర (జపాన్) చేతిలో ఓడి రెండోస్థానంతో సరిపెట్టుకుంది. భారత్ తరపున ఫైనల్ చేరిన రెండో క్రీడాకారిణిగా రికార్డులకెక్కిన సింధు గతంలో రెండుసార్లు ఇదే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలను సాధించింది. ఓవరాల్‌గా సైనా కాంస్యంతో కలిపి ఈసారి చాంపియన్‌షిప్‌లో భారత్ ఎప్పుడు లేని విధంగా రెండు పతకాలు గెలిచి మరో రికార్డును సొంతం చేసుకుంది.

గతంలో భారత్‌కు రజతంతో పాటు నాలుగు కాంస్యాలు లభించాయి. 1983లో ప్రకాశ్ పదుకొనే భారత్‌కు తొలి కాంస్యాన్ని అందించాడు. 2011లో డబుల్స్‌లో అశ్విని-జ్వాల జోడి మళ్లీ కాంస్యంతో మెరిసింది.

## జాప్యం వద్దు

- కొలువుల భర్తీకి సత్వరమే వివరాలివ్వాలి
- అన్ని శాఖలు టీఎస్‌పీఎస్సీకి అందజేయాలి
- సీఎస్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం



హైదరాబాద్: ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం వేగంగా ముందడుగు వేస్తున్నప్పటికీ పలుశాఖలు క్రియాశీలకంగా వ్యవహరించని తీరుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దృష్టిసారించారు. నియామక సంస్థ అయిన టీఎస్‌పీఎస్సీకి వివరాలివ్వడంలో జాప్యంచేస్తున్న శాఖలు సత్వరమే సమగ్ర వివరాలు అందించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారని సమాచారం. త్వరలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు సంబంధించి ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టమైన ప్రణాళికను ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలోనూ ప్రభుత్వం వేల కొలువుల భర్తీకి అనుమతులు ఇచ్చింది. వాటికి ఆర్థిక శాఖ అనుమతులూ వచ్చాయి.

కానీ నియామక సంస్థ టీఎస్‌పీఎస్సీ నుంచి ఆశించిన ఉద్యోగ ప్రకటనలు వెలువడలేదు. ఈ విషయంలో జాప్యం గురించి సీఎం ఆరాతీయగా.. పలుశాఖలు సమాచారం ఇవ్వకపోవడం, అసమగ్ర వివరాలు ఇవ్వడం కారణంగా నోటిఫికేషన్లు విడుదల చేయలేదని టీఎస్‌పీఎస్సీ వివరించినట్టు తెలిసింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి

తరువాయి 2లో

## 40 కంపెనీలకు షాక్!

### రెండవ జాబితా సిద్ధం..




న్యూఢిల్లీ: భారీ రుణ ఎగవేతదారులకు షాకిచ్చే దిశగా కేంద్ర బ్యాంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేగంగా కదులుతోంది. కార్పొరేట్ల నుంచి మొండిబకాయిలను రాబట్టుకునే ప్రక్రియలో భాగంగా ఆర్‌బీఐ మరో జాబితాను సిద్ధం చేసింది. దాదాపు 30-40 కంపెనీలతో కూడిన రెండవ జాబితాను త్వరలోనే విడుదల చేయనుంది. ఇందులో భాగంగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో కేసు దాఖలు చేయనుంది. ఎకానమిక్స్ టైమ్స్ నివేదిక ప్రకారం రిజర్వ్ బ్యాంక్ ఈ సెప్టెంబర్ లో ఈ రెండవ జాబితాను బహిర్గతం చేయనుందని తెలుస్తోంది. వీటిలో ముఖ్యంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పవర్ సెక్టార్ కంపెనీలు ఉండనున్నాయి. ఉత్తమ్ గాల్వా, వీడియోకాన్, విసా స్టీల్, కాస్టెక్స్ టెక్నాలజీస్ , జెఎస్‌పీఎల్ తదితర కంపెనీలు ఇందులో ఉండనున్నాయి. కాగా ఈ వార్తలపై స్పందించడానికి ఉత్తం గాల్వా, వీడియో కాన్ కంపెనీ ప్రతినిధులు నిరాకరించారని ఎకానమిక్స్ టైమ్స్ రిపోర్ట్ చేసింది.

## ముంబైని ముంచెత్తిన వాన

- పలు లోకల్ రైళ్లు రద్దు
- విమానాలు కూడా ఆలస్యమే
- కుంభవృష్టి సమాచారంతో ముంబైవాసుల్లో ఆందోళన



ముంబై: భారత ఆర్థిక రాజధాని ముంబై భారీ వర్షాలతో అతలాకుతలమవుతున్నది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం ముంబై వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. లోకల్ రైళ్లను రద్దు చేశారు. విమానాలు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు నడుములోతు నీళ్లలో మునిగిపోయాయి. దీనికితోడు రానున్న 48 గంటల్లో కుంభవృష్టి కురవనున్నదన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ముంబై వాసులను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నది. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు బ ృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) తెలిపింది. భారీ వర్షాలతో సియోన్, దాదర్, ముంబై సెంట్రల్, కుర్లా, అంధేరీ, సాకినాక ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. ఇవాళ ఉదయం నుంచే ఆరు

తరువాయి 2లో

## ఇపామా అధ్యక్షుడిగా తెలంగాణ బిడ్డ



హైదరాబాద్ : ఇండియన్ ప్రింట్ అండ్ ప్యాక్ అలైడ్ మిషనరీ అసోసియేషన్(ఇపామా) అధ్యక్షుడిగా తొలిసారిగా తెలంగాణ బిడ్డ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇపామా అధ్యక్షుడిగా ఎంపికైన శ్రీపతి దయాకర్‌రెడ్డిని తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. హోటల్ అశోక వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. ఇపామా అధ్యక్షుడిగా శ్రీపతి దయాకర్‌రెడ్డి ఎంపికవడం తెలంగాణ ముద్రణా రంగానికి గర్వకారణమని కొనియాడారు. దక్షిణ భారతదేశం నుంచి తొలిసారిగా దయాకర్‌రెడ్డి ఇపామా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం తెలుగు వారంతా సంతోషించాల్సిన సందర్భమని పేర్కొన్నారు. ప్రింటింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను

తరువాయి 2లో

## అమెరికాకు పాక్ ఝలక్

### ద్వైపాక్షిక చర్చలు రద్దు .. అమెరికాతో సంబంధాలకు దూరం

ఇస్లామాబాద్: అగ్రదేశం అమెరికాకు దాయాది పాకిస్థాన్ ఝలక్ ఇచ్చింది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రతీకారంగా పాకిస్థాన్ అమెరికా పర్యటనలు మొత్తం రద్దు చేసుకున్నట్లు ప్రకటించింది.

అఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్‌పై అమెరికా విధాన ప్రకటన సందర్భంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు నిరసనగా తమ పర్యటనలు రద్దు చేసుకున్నామని పాక్ సెనేట్ కమిటీకి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసీఫ్ తెలిపారని ఆదేశంలోని ద నేషన్ పత్రిక తెలిపింది. పాక్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసీఫ్ గత వారం అమెరికా పర్యటనకు వెళ్లాల్సి ఉంది.



చివరి నిమిషయంలో ఖవాజా ఆసీఫ్ తన అమెరికా పర్యటన రద్దు చేసుకున్న సమయంలో ఆయన మాటలకు ప్రాధాన్యత సంతరించుకుంది. కరాచీలో

తరువాయి 2లో






## టేకిట్ ఈజీ



సార్!! రిజర్వ్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయాలతో మన కంపెనీలకు బ్రేక్ రాకుండా చూసుకోండి!!

## జీఎస్‌టీతో ఆగిన పనులు

### ఎంఎంటీఎస్ రెండోదశపై ప్రభావం .. నిలిచిపోయిన ఆర్‌యూబీల నిర్మాణం



హైదరాబాద్ః పలు అవాంతరాలతో ఆగుతూ.. సాగుతున్న ఎంఎంటీఎస్ రెండోదశ పనులకు ఇప్పుడు మరో కొత్త చిక్కు వచ్చింది. రైల్వే అండర్ బ్రిడ్జి పనులు అర్థాంతరంగా ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వే చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై ఇప్పుడు వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) ప్రభావం పడుతోంది. ఎంఎంటీఎస్ రెండో దశ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం అవుతుందని దక్షిణమధ్య రైల్వే జీఎం స్పష్టమైన ప్రకటన చేశారు. లింగంపల్లి నుంచి తెల్లాపూర్‌కు పూర్వం ఉన్న రైల్వే లైనును పునరుద్ధరించి.. విద్యుదీకరించి ఎంఎంటీఎస్ రైళ్లు పరుగులు పెట్టించేందుకు అంతా సిద్ధమైంది కనుక ఇబ్బంది లేదు. ఇది కేవలం 5 కిలోమీటర్లు మాత్రమే.

తరువాయి 2లో

# సంఘ సేవతో కలిగే ఆనందం మాటల్లో వర్ణించలేం

## ఎన్‌టీఆర్ సేవా సమితి తొమ్మిదో వార్షికోత్సవాలు

**జమ్ముల జయలక్ష్మి**



బ్రహ్మపుర : సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినప్పుడు ఎదుటి వారి ముఖాల్లో కనిపించే ఆనందం మాటల్లో వర్ణించలేమని, ఆ ఆనందానికి కొలబద్ధ లేదని రోలాండు విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ జమ్ముల జయలక్ష్మి అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ సేవా సమితి తొమ్మిదో వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక ఖస్పావీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ఆవరణలో జరిగిన వేడుకలకు అతిథిగా హాజరైన జయలక్ష్మి మాట్లాడుతూ సంఘ సేవతో కలిగే ఆనందం అనిర్వచనీయమైనదని చెప్పారు. ఎన్‌టీఆర్ సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆమె అభినందించారు. 'సేవా' సమితి పేరులోనే అర్థం, పరమార్థముందని చెప్పారు. ఎన్‌టీఆర్ సేవా సమితి సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరంగా నిర్వహించాలని ఆమె కోరారు. మరో అతిథిగా హాజరైన యువ వైద్య నిపు ణుడు సునీల్ కుమార్ కోట మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. ఆయన పేరిట సేవా సమితి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ కోట ప్రేక్షకులకు పలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. అతిథిగా పాల్గొన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం అసోసియేట్ మేనేజింగ్ ట్రస్టీ జామి శ్రీనివాస రావు మాట్లాడుతూ సేవా సమితి భవన నిర్మాణానికి అవసరమయ్యే స్థలం సమకూర్చేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నానని హర్షధ్వానాల మధ్య తెలిపారు. సేవా సమితి గౌరవ సలహాదారు, వైద్యుడు జమ్ముల నారాయణరావు సమన్వయకర్తగా వ్యవహరించిన వేడుకల్లో సేవా సమితి అధ్యక్షుడు ఆర్.తిరుపతిరావు ప్రారంభోపన్యాసం చేయగా, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా వేడుకల్లో జమ్ముల నారాయణరావు, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు)లను నిర్వాహకులు సత్కరించారు. సేవా సమితి నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలు, వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు అతిథులతోపాటు తూతిక గోపి, కార్పొరేటరు పోలాకి ఆశారాణి తదితరులు బహు మతులు, జ్ఞాపికలు అందజేశారు. అంతకుముందు జమ్ముల శైలజ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. చివరిగా స్థానిక క్రేజీ స్టార్ డ్యాన్స్ అకాడమీ ఔత్సాహిక కళాకారులు ఆధునిక నాట్యాలతో అలరించగా, బీఎస్‌ఎస్‌ఆర్ బ ృందం గాయనీ, గాయకులు మధుర గీతాలు ఆలపించారు. వేడుకల్లో కాశీబుగ్గకు చెందిన ఈశ్వర పాత్ర్ ధ్వన్య నుకరణ, మాట్లాడే బొమ్మతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. సేవా సమితి ప్రతినిధులు సీహెచ్.చక్రధరరావు, ఏ.లక్ష్మీప్రసాద్ ఇతర ప్రతినిధులు సహకరించారు. వేడుకలకు పలువురు స్థానిక కార్పొరేటర్లు, తెలుగు సంస్థల ప్రతినిధులు, సేవా సమితి ప్రతి నిధులు తదితరులు హాజరయ్యారు.

## తైక్వాండో క్రీడాకారులకు
# బెల్టులు ప్రదానం

ఛత్రపురం : గంజాం జిల్లా తైక్వాండో అసోయేషన్ ఆధ్వ ర్యంలో ఛత్రపురంలోని పబ్లిక్ స్కూల్లో రంగు బెల్టుల పరీక్ష, పలు అంశాల ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటైంది. ఇందులో జిల్లాలోని వివిధచోట్ల నుంచి 40 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆల్ ఒడిశా తైక్వాండో అసోసియేషన్ న్యాయనిర్ణేత కె.మనోజ్‌ప్రధాన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో బాల బాలికలు పోటీపడి ఉత్తీరు?లై వివిధ రంగుల బెల్టులను కైవసం చేసుకున్నారు. అనంతరం ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన మూడో జాతీయ కేడెట్ తైక్వాండో పోటీల్లో గెలుపొందిన రుద్రనారాయణ బెహర, మోహిత్ కుమార్ సాహు, ఎ.అక్షిత్‌రావు, లోపముద్ర ప్రధాన్‌లను అసోసి యేషన్ తరపున సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగు విద్యార్థులకు
# చేయూతనివ్వండి

బెంగళూరు : విశ్రాంత ఉపకులపతి, మూర్తి దేవి అవార్డు గ్రహీత, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ బెంగళూరు విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖకు విచ్చేశారు. కర్ణాటకలోని తెలుగు విద్యాసంస్థలు, విద్యార్థులకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. తెలుగు అధ్యయన శాఖాధ్యక్షురాలు ఆచార్య కె.ఆశాజ్యోతి, తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు డా.డి.కె.ప్రభాకర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు ఆయనను ఘనంగా సత్కరించారు. తెలుగు అధ్యయన శాఖ అభివ ృద్ధికి కొలకలూరి ఇనాక్ పలు సూచనలు చేశారు.

# ఒడిశా అభివృద్ధి మందకొడి

## కేంద్రమంత్రి టి.సి.గెహ్లాట్



కటక్ : ఒడిశా అభివృద్ధి మందకొడిగా కొనసాగుతోందని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి టి.సి.గెహ్లాట్ అన్నారు. ఆయన కటక్‌లో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం బక్షిబజార్ ప్రాంతంలో ఉన్న గోపబంధు భవన్‌ను సందర్శించారు. అక్కడున్న ఉత్కళమణి గోపబంధు దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 17 ఏళ్లుగా నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, అయినా రాష్ట్రం ఆశించిన అభివృద్ధి సాధించలేదన్నారు. ఒడిశాలో విద్య, ఆరోగ్య సేవలు దయనీయంగా ఉన్నాయన్నారు. మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు కల్పించడంలో, రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. భాజపా పాలనలోకి వస్తేనే రాష్ట్రాభివ ృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సమీర్ దే, భాజపా కటక్ జిల్లా, నగర కార్యకర్తలు, నేతలు తిరంగా యాత్రలో పాల్గొన్నారు.

# గ్రామంలో మద్య నిషేధానికి తీర్మానం



కంప్లి : ముద్దాపుర గ్రామ పంచాయతీ పరిధిలో మద్య నిషేధానికి గ్రామ పంచా యతీ తీర్మానించింది. అధ్యక్షురాలు ఎం.ఎస్. మాంతమ్మ అధ్య క్షతన జరిగిన సమా వేశంలో సభ్యులు ఏకగ్రీవంగా మద్య నిషేధానికి అంగీక రించారు. పంచాయతీ పరిధి లోని 10.ముద్దాపుర, బెళగోడు హాళ, కణవి తిమ్మలాపుర, ప్రభు క్యాంపు, యల్లమ్మక్యాంపు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు అధికమయ్యాయి. గ్రామాల్లో దండోరా వేయించి మద్యం విక్రయా లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. ప్రభు క్యాంపులో రోడ్లు వేశారు. మురికికాల్వలు నిర్మించలేదు. వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. మరికొన్ని చోట్ల మురికికాల్వలు నిండిపోయి మురుగు వీధుల్లో పారుతుంది. వర్షాకాలం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తగు చర్యలు తీసుకోవాలని అక్కడి సభ్యులు సమా వేశం దృష్టికి తెచ్చారు. అభివృద్ధి అధికారి బీర లింగ మాట్లాడుతూ పంచాయతీకి నిర్వహణ ఖర్చులు అధికమవుతున్న దృష్ట్యా ఈ సారి ఇంటి పన్ను పెంచామన్నారు. ప్రభుక్యాంపులో ఇంటి పన్ను వసూలు చేసి ఆ నిధులతో అక్కడే పనులు చేపడతామని తెలిపారు. ముద్దాపురలో మరో 150 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తే గ్రామంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తవుతుంది. గాంధీ జయంతిలోపు వాటిని సైతం పూర్తి చేస్తామన్నారు. అనంతరం వివిధ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఉపాధ్యక్షుడు ఉమేష్, కార్యదర్శి హనుమంతప్ప, తాయణ్ణ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సామూహిక నాయకత్వంలోనే
# ఎన్నికలకు వెళతాం: దేవేగౌడ

బెంగళూరు : రానున్న శాసనసభ ఎన్నికలు తమ పార్టీ నాయకుల సామూహిక నాయకత్వంలోనే ఎదుర్కొంటామని మాజీ ప్రధాని, దళపతి దేవేగౌడ వెల్లడించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఎవరితో పొత్తు లేకుండా అన్ని నియోజక వర్గాల నుంచి జనతా దళ అభ్యర్థులు ఒంటరిగా బరిలో ఉంటారని వెల్లడించారు. అభ్యర్థులను ముందస్తుగా ప్రకటించాలని నిర్ణయించినప్పటికీ, కార్య కర్తలతో చర్చించిన తరువాతే జాబితా విడుదల చేయాలని తీర్మానం చేశామన్నారు. ఆయా జిల్లా లకు వ్యవహారాల బాధ్యుల జాబితాను దేవేగౌడ విడుదల చేశారు. కుమారస్వామి ఇజ్రాయెల్ పర్యటనకు ముందుగానే ఈ జాబితా విడుదల చేయాలని నిర్ణయించినా సాధ్యం కాలేదన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏడుగురు సీనియరు నాయకుల నేతృత్వంలో నూతన పథాధికారులు, దళ ప్రతి నిధులు పని చేస్తారని తెలిపారు. నూతన జాబితాలో మైనార్టీలు, మహిళలకు పెద్దపీట వేశామని చెప్పారు.

పార్టీ శ్రేణులను చైతన్య పరిచేందుకు త్వరలో తాము రాష్ట్ర పర్యటన చేస్తామని తెలిపారు.

# ఇళ్ల స్థలాలు ఇవ్వండి: లబ్ధిదారుల ఆందోళన

కటక్ : ఇళ్ల స్థలాల కోసం 17 ఏళ్ల క్రితమే డబ్బులు చెల్లించామని, ఇంతవరకు కటక్ అభివ ృద్ధి సంస్థ(సీడీఏ) అధికారులు తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని సీడీఏ అవాసిక సంఘం కార్యదర్శి సౌమ్యరంజన్ పట్నాయక్ ఆరోపించారు. సీడీఏ కార్యాలయం ఎదుట సంఘం కార్యకర్తలు, ఇళ్ల స్థలాల కోసం మొత్తాలు చెల్లించినవారు ఆందోళన చేపట్టారు. ఆందోళనలో పాల్గొన్న పట్నాయక్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు డబ్బులు చెల్లించామని, ప్లాట్లు కేటాయించినా 17 ఏళ్లుగా స్థలాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఆందోళనలు చేపట్టినపుడు హామీలు ఇస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదని, 15 రోజుల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయకపోతే సీడీఏ కార్యాలయానికి తాళం వేస్తామని హెచ్చరించారు. రెండు గంటల పాటు ధర్నా నిర్వహించిన తర్వాత సీడీఏ అధికారులు ఆందోళనకారుల వద్దకు చేరుకుని త్వరలో ప్లాట్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### బీఎమ్సీ 150 ఏళ్ల లోగోను ఆవిష్కంచిన సీఎం నవీన్

బ్రహ్మపుర : బ్రహ్మపుర నగరపాలక సంస్థ (బీఎమ్సీ) 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రూపొందించిన లోగోను సీఎం నవీన్ పట్నాయక్ ఆవిష్కరించారు. భువనేశ్వర్‌లోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ లోగోను ఆవిష్కరించి అధికారులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

# అథోగతిలో జింకల పార్కు

గోపాలపూర్ : బ్రహ్మపుర విశ్వవిద్యాలయం(భంజవిహార్) క్యాంపస్‌లోని జింకల పార్కు అటవీశాఖ నిర్లక్ష్యం వల్ల అధ్వానంగా మారుతోంది. దీన్ని వేరేచోటుకు తరలించడానికి ఆ శాఖాధికారులు నిర్ణయం తీసుకుని ఏడాది కావస్తున్నా కార్యాచరణ ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో మూగప్రాణుల సంరక్షణ భంజ విహార్ యంత్రాంగానికి భారంగా పరిణమించింది. నాలుగు దశాబ్దాల క్రితం నాటి పాలనాధికారి ఎం.వై.రావు రెండు జింక పిల్లల్ని తెచ్చి వాటి సంరక్షణకు ఒక తాత్కాలిక ఉద్యోగికి అప్పగించారు. తర్వాత వాటి సంతతి వృద్ధి చెందింది. దీంతో ఐదెకరాల విస్తీర్ణంలో చుట్టూ కంచె ఏర్పాటు చేసి డీర్ పార్కుగా తీర్చిదిద్దారు. భంజవిహార్‌కిది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరో వైపు వీటి సంఖ్యతోపాటు వాటి ఆహారం, మందులు, రక్షణ కోసం ఖర్చులు కూడా అదేస్థాయిలో పెరిగాయి. ఇంతలో 2013, 2014లలో వరుసగా వచ్చిన తుపానుల్లో నాలుగు జింకలు మృతి చెందాయి. దీంతో భంజవిహార్ అధికారులు అటవీశాఖకు పరిస్థితి వివరించి సాయం కోరారు. కేంద్ర జూ అథారిటీ కూడా తెలియజేశారు. వన్యప్రాణుల చట్టం ప్రకారం విశ్వ విద్యాలయం సమీపంలో డీర్ పార్కు ఉండకూడదు. దీన్ని తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. తరలింపునకయ్యే రూ.20 లక్షల వ్యయాన్ని భరించాలని స్పష్టం చేశారు. డీర్ పార్కులో ప్రస్తుతానికి 60 వరకు జింకలున్నాయి. వాటి సంరక్షణకు సిబ్బంది, ఇతరత్రా బాపతున ఖర్చులు పెరిగాయి. భంజవిహార్‌లో వన్యప్రాణులు ఉండరాదని అటవీశాఖ స్పష్టం చేసింది. దీంతో యంత్రాంగం తరలింపునకు అంగీకరించింది. ఇందుకోసం రూ.10 లక్షల మొత్తాన్ని ఇదివరకే అటవీశాఖకు చెల్లించింది. మిగిలిన మొత్తం కూడా చెల్లించేందుకు ముందుకొచ్చింది. గంజాం జిల్లా కళ్లికోట పరిధిలోని అటవీ ప్రాంతంలో అయిదెకరాల్లో జింకల పార్కు ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. ఏడాది కావస్తున్నా తరలింపు కాలేదు. దీంతో భంజవిహార్ అధికారులు అసంత ృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిధుల లేమితో ఇబ్బందులు చవి చూస్తున్న విశ్వవిద్యాలయానికి మూగ ప్రాణుల సంరక్షణ భారంగా పరిణమించిందని రిజిస్ట్రార్ రెమిష్ కరైటా చెప్పారు. అటవీ శాఖతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రూ.10 లక్షలు చెల్లించి 10 నెలలైనా ఆ శాఖాధి కారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనిపై లేఖలు రాస్తున్నా సమాధానం లేదన్నారు.

భంజవిహార్‌లో డీర్ పార్కు ఉండరాదని, దీనికి తమ సహకారం ఉండదని స్పష్టం చేసిన అటవీశాఖ తరలింపునకు ఆదేశించి సొమ్ము కూడా సొంతం చేసుకుని తర్వాత నిర్లక్ష్యం చేయడం దురద ృష్టకరమన్నారు. దీనిపై మరో లేఖ రాస్తున్నట్లు చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

## ముంబైని ముంచెత్తిన వాన

సెంటీమీటర్ల వరకు వర్షం కురిసింది. అటు సముద్రం ఎగిసిపడుతున్నది. సోమవారం సాయంత్రం మూడున్నర మీటర్ల ఎత్తయిన అలలు రికార్డయ్యాయి. అయితే భారీ వర్షాలతో ముంబైకి తాగు నీరందించే నాలుగు రిజర్వాయర్లు పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతుండటం నగర వాసులను ఆనందానికి గురి చేస్తున్నది. వచ్చే 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రాకూడదని అధికారులు స్పష్టంచేస్తున్నారు.

## అమెరికాకు పాక్ ఝలక్

అమెరికాకు వ్యతిరేకంగా ప్రస్తుతం ఆందోళనలు జరుగుతున్నాయి. అమెరికా సీనియర్ అధికారి, దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల తాత్కాలిక ఉప ప్రధాన కార్యదర్శి అలైస్ వెల్స్ ఇస్లామాబాద్ పర్యటన ఇదే సమయంలో వాయిదా పడింది. అఫ్ఘనిస్థాన్ లో అమెరికా పౌరులను దారుణంగా చంపుతున్న ఉగ్రవాదులకు పాక్ స్వర్గధామంగా మారిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో అమెరికాతో సంబంధాలకు దూరంగా ఉంటున్నామని పాకిస్థాన్ అంటోంది.

## జాప్యం వద్దు

మార్గదర్శకాలు, రోస్టర్లు తదితర వివరాలను సదరు శాఖలు టీఎస్‌పీఎస్సీకి అందించాల్సి ఉంది. ఈ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీనిపై సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. వివరాలు ఇవ్వడంలో తాత్సారం చేస్తున్న శాఖల నుంచి సమగ్ర సమాచారం తెప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి సూచించారని తెలిసింది.

## ఇపామా అధ్యక్షుడిగా తెలంగాణ బిడ్డ

సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానని పసునూరి దయాకర్ చెప్పారు. తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దయాకర్‌రెడ్డిని జాతీయస్థాయి పదవి వరించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రింటింగ్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ తరపున ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పాలని ఆలోచిస్తున్నామని, అందుకు సాయమందించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సూర్యచంద్ర రెడ్డి, కరుణాకర్, కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి రాధాకృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్‌టీతో ఆగిన పనులు

మొత్తం 95 కిలోమీటర్ల మేర ఎంఎంటీఎస్ రెండో దశ పరుగులు పెట్టాల్సి ఉండగా.. ఈ పనులకు జీఎస్‌టీ దెబ్బ తగిలింది. మొత్తం రూ.816 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకూ ఖర్చు చేసింది దాదాపు రూ. 350 కోట్లు. ఇక రూ. 466 కోట్ల పనులపై ఇప్పుడు 18 శాతం కింద జీఎస్‌టీ పన్ను పడనుంది. గుత్తేదార్లు భరించలేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు రూ.80 కోట్లతో రైల్వే కిందివంతెనలు

మల్కాజిగిరి నియోజకవర్గం అనగానే రైల్వే లైన్లు.. వాటి చెంత అక్కడి వాహనదారులు, ప్రజలు పడుతున్న అవస్థలు అందరికీ గుర్తుకు వస్తాయి. గూడ్సు, ప్రయాణికుల రైళ్లు వచ్చినప్పుడు గేట్లు వేయడంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం అందరికీ తెలిసిందే. అందుకే ఇక్కడ దాదాపు రూ.80 కోట్లతో రైలు పట్టాల కింద వంతెనల(ఆర్‌యూబీలు)ను చేపట్టారు. 2015లో మంత్రి హరీశ్‌రావు ఈ పనులు ప్రారంభించారు. ఉత్తంనగర్, ఆనంద్‌బాగ్, వాజ్‌పేయినగర్ దగ్గర చేపట్టిన ఆర్‌యూబీ పనుల్లో కేవలం ఉత్తంనగర్ దగ్గర మాత్రమే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఆనందబాగ్ దగ్గర పనులు కేవలం 10 శాతమే పూర్తయ్యాయి. ఉత్తంనగర్ వంతెన కోసం రూ.18 కోట్లు.. ఆనంద్‌బాగ్ వద్ద రూ.32.50 కోట్లు.. వాజ్‌పేయినగర్ వంతెన కోసం 29 కోట్లతో పనులు చేపట్టారు. ఇక్కడ ఈ పనులకోసం ఉన్న దారిని కూడా మూసేయడంతో రాకపోకల అవస్థలు రెట్టింపయ్యాయి. వాజ్‌పేయినగర్ దగ్గర మాత్రం ప్రారంభం కాలేదు.

పన్ను ప్రభావం తక్కువే..

జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన జీఎస్‌టీ పన్ను ఇప్పుడు కాంట్రాక్టర్లకు సాకుగా మారుతోంది. జులై కంటే ముందుగా ఈ పనుల అంచనా.. చేపట్టినందున మధ్యలో కొత్తగా వచ్చిన జీఎస్‌టీ ప్రభావం తమపై పడకూడదని గుత్తేదార్లు వాదిస్తున్నారు. జీఎస్‌టీని మినహాయించాలని కోరుతూ పనుల్లో వేగాన్ని తగ్గించేశారు. కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీటీ శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రతినిధులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. అక్కడకు వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ జీఎస్‌టీ ప్రభావంపై స్పష్టత ఇచ్చినా.. ప్రయోజనం లేకపోయింది. సిమెంటు, స్టీలుపై భారీగా పన్ను తగ్గిందని.. వీటితో పోల్చితే జీఎస్‌టీ ప్రభావం తక్కువే అని స్పష్టం చేశారు. అయినా ససేమిరా అంటున్నారు.

తర్వాత తేల్చుకోవచ్చు కదా !

జీఎస్‌టీ పన్నుల భారం పేరిట అభివృద్ధి పనులు ఆపేస్తే ఎలా..అని కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రశ్నిస్తోంది. పన్నుల వివాదం చివరిలో చెల్లింపులప్పుడు లెక్కలు తేల్చుకోవచ్చు కాని.. ఇప్పుడు పనులను కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. ఆనంద్‌బాగ్ దగ్గర ఆర్‌యూబీ పనులకు కొన్నాళ్లు రహదారులు, భవనాలశాఖ పరిధి అని జీహెచ్‌ఎంసీకి మార్చడంతో ఆటంకాలు ఏర్పడ్డాయి. రెండున్నరేళ్లు దాటినా కేవలం 10 శాతమే పనులు అవడంతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌యూబీ పనులు, ఎంఎంటీఎస్ రెండో దశ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సమాఖ్య ప్రతినిధులు కోరుతున్నారు.

# 1న 250 ఇంజినీరింగ్ కళాశాలల బంద్

బళ్లారి : ఇంజినీరింగ్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెం బరు 1న రాష్ట్ర వ్యాప్తంగా 250 ఇంజినీరింగ్ కళాశాలల బంద్ చేపట్టనున్నామని ఎ.ఐ.డి. ఎస్.ఒ. జిల్లా అధ్య క్షుడు గోవింద్, విద్యార్థి పోరాట సమితి సంచాల కుడు జగదీష్ తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు (నాన్-సి.బి.సి.ఎస్) క్రిటికల్ ఇయర్, ఇయర్ బ్యాక్, ఐదో సెమిస్టర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ చేపట్టనున్నామని తెలిపారు.

# ఘనంగా వినాయక నిమజ్జనం





పళ్ళిపట్టు : వినాయక చవితి సందర్భంగా పళ్ళిపట్టులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం ఘనంగా జరిగింది. పళ్ళిపట్టు సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నెమిలి వాహన పంచముఖ వినాయక ప్రతిమను మేళతాళాల నడుమ పట్టణంలో వూరేగించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా వేడుకలు నిర్వహించారు. అదే విధంగా కె.కె.నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వూరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

తిరువణ్ణామలైలో..:

తిరువణ్ణామలై జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. సింగారపేట చెరువు, కొనిరాయన్ గుంట, ఐదు కన్నుల వారావది, భూమా చెట్టిగుంట, పోలూరు చెరువు, కూర్ చెరువులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 1700 విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంతకు ముందు తిరువణ్ణామలై పట్టణంలో జరిగిన వినాయక విగ్రహాల వూరేగింపులో ఘర్షణ జరగడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ ఘటనలో ఒక విగ్రహం విరిగిపోయింది. పట్ట ణంలో ఏర్పాటుచేసిన విగ్రహాల వూరేగింపు సాయంత్రం ప్రారంభమైంది. తేనీమలై ప్రాంతా నికి చెందిన యువకులకు, సముద్రంనగర్ ప్రాంతానికి చెందిన యువకుల మధ్య పాతకక్షల కారణంగా సమయంలో ఘర్షణకు దిగడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలోని కామరాజర్ విగ్రహం వద్దకు వూరేగింపు చేరుకోగా పశువుల ఆసుపత్రి, పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాల్లోని ఇళ్లలోంచి కొందరు రాళ్లు, సీసాలు భక్తులపైకి విసిరారు. ఈ ఘటనలో నలుగురికి తలలకు దెబ్బలు తగి లాయి. విధుల్లో ఉన్న పెరనమల్లూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ సిబ్బందిపైనా రాళ్లు పడ్డాయి. అదే సమయంలో విద్యుత్తు సరఫరా ఆగిపోయింది.

పోలీసులు రహదారిపైకి చేరిన గుంపుపై లాఠీఛార్జి చేశారు. దీంతో వూరేగింపులో పాల్గొన్న భక్తులు తలోదిక్కుకు పరుగులు తీశారు. రహదారులపై ఎటుచూసినా రాళ్లు, సీసాలు, కుర్చీలు కనిపించాయి. ఈ ఘటనలో వూరేగింపులోని ఓ విగ్రహం పగిలి పోయింది. చివరకు పోలీసులు అక్కడి విగ్రహాలను తీసుకెళ్లి సముద్రం నగర్‌లోని తామర గుంటలో నిమ జ్జనం చేశారు. తర్వాత పట్టణంలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు.

## రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

వలిగొండ : రైతులు తీసుకున్న దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణ వసతి కల్పిస్తామని జిల్లా సహకార బ్యాంక్ అధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. వలిగొండలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ప్రాంగణంలో సంఘం సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రుణాలు సకాలంలో చెల్లించినపుడే సంఘాలు బలోపేతం అవుతాయని అన్నారు. పీఏసీఎస్‌లు ప్రభుత్వ సంస్థలు కావని, స్వయంప్రతిపత్తి సంఘాలన్నారు. రైతులు వాటి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్నారు. ఇప్పటికే సంఘాలు రైతు సేవ కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. తద్వారా సమకూరే ఆదాయంతో రైతులకే తిరిగి రుణవసతికే సమకూర్చుతామని చెప్పారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సురికంటి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సహకార యూనియన్ లెక్చరర్ వెంకటేశ్వర్‌రావు, బ్యాంకు మేనేజర్ షరీఫ్, ఉపాధ్యక్షురాలు జానకమ్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్, పాలకవర్గం సభ్యుడు జూకంటి నర్సింహ, సత్యనారాయణ పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు చేయండి



ప్రగతిభవన్ : రాష్ట్ర ప్రభుత్వం అందజేసే బతుకమ్మ చీరలను సెప్టెంబరు 18, 19 తేదీల్లో గ్రామాలు, మున్సిపాల్టీలలో పంపిణీ చేయాలని, దీనికి గాను కావల్సిన ఏర్పాట్లు చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ రవీందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వీసీ ద్వారా ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో మాట్లాడారు. జిల్లాకు కేటాయించిన 5,13,739 బతుకమ్మ చీరలు సెప్టెంబరు 15వ తేదీ లోపు జిల్లాకు వస్తాయని తెలిపారు. వచ్చిన వాటిని వ్యవసాయశాఖ గోదాంలో భద్రపర్చాలని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, స్థానికంగా ఉండే కమ్యూనిటీ హాల్ వద్ద పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 20వ తేదీ వరకు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పంపిణీ కార్యక్రమానికి స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. ఆహార భద్రత కార్డులో పేరు ఉండి 18 సంవత్సరాలు నిండిన వారికి ఇవ్వాలన్నారు. గ్రామాల్లో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, రేషన్ డీలర్ పంపిణీ చేయాలని, మున్సిపాల్టీలలో మున్సిపల్ బిల్ కలెక్టర్లు, మున్సిపల్ ఉద్యోగులు, రేషన్ డీలర్‌ల ద్వారా అందజేయాలన్నారు. నగరం, పట్టణాలలో చీరల పంపణీకి మున్సిపల్ కమిషనర్లు బాధ్యత వహించాలని చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. వీసీలో డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీవో కృష్ణమూర్తి, డీఎస్‌వో కృష్ణప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు



నిజామాబాద్ : జిల్లాలో నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయి. రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళ, బుధవారాల్లో కూడా దీని దీని ప్రభావం ఉండవచ్చని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. బోధన్‌లో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నవీపేట, బోధన్, రెంజల్, నందిపేట, మాక్లూర్, బాల్కొండ తదితర మండలాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో చెరువుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గణేశ్ ఉత్సవాలు కొనసాగుతుండడంతో వీధివీధినా ఏర్పాటుచేసిన గణనాథుల మండపాలు తడిసి ముద్దవుతున్నాయి.

జిల్లాలో మొత్తం 27 మండలాలుండగా 20 మండలాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. బాల్కొండ పాత మండలం, ధర్పల్లి, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, ఆర్మూర్, సిరికొండ, భీమ్‌గల్ తదితర మండలాల్లో 30 శాతం కంటే ఎక్కువగా లోటు వర్షపాతం ఉంది. రెంజల్, నవీపేట మండలాల్లో మాత్రం వర్షాలు సమృద్ధిగా కురిశాయి. సీజన్ ప్రారంభం నుంచి కూడా ఈ రెండు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రెంజల్ మండలంలో ఇప్పటివరకు సాధారణం 703 మిల్లీమీటర్ల వర్షం పడవలసి ఉండగా 840 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అంటే 19 శాతం అదనం. అలాగే నవీపేట మండలంలోను ఇప్పటివరకు సాధారణ వర్షం 698.7 మిల్లీమీటర్లు పడవలసి ఉండగా 817.6 మిల్లీమీటర్లు నమోదైంది. ఇది 17 శాతం ఎక్కువ అని అధికారులు వెల్లడించారు. చిన్న జిల్లా అయినప్పటికి బోధన్ డివిజన్‌లో భారీ వర్షాలు, నిజామాబాద్ డివిజన్‌లో సాధారణం, ఆర్మూర్ డివిజన్‌లో అతి తక్కువ వర్షాలు పడడం విశేషం.

## పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నిజామాబాద్ : ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందనే నమ్మకం ఉందని టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. 2004 సెప్టెంబరు 1వ తేదీన యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానానికి వ్యతిరేకంగా ఈ నెల 30న ర్యాలీలు, సెప్టెంబరు 1వ తేదీన మధ్యాహ్నం సమయంలో నల్లాబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన వ్యక్తం చేయాలని చెప్పారు. ర్యాలీ, నిరసన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రులను నగరంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు.

కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకంలో జమ చేసిన నిధులన్నీ అడ్డగోలుగా షేర్ మార్కెట్, రియల్ ఎస్టేట్‌లు, పాలకవర్గానికి అనుకూలంగా ఉన్న కంపెనీలకు పెట్టుబడులు పెట్టడం ద్వారా నష్టం జరిగిందన్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా పాత పింఛన్ విధానానికి ప్రత్యేక కమిటీలు వేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తుందని, దీన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా పీఎఫ్ ఆర్‌డీఏ నుంచి వైదొలిగి పాత పింఛణ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ నెల 30, సెప్టెంబరు 1వ తేదీన జరిగే ఆందోళనలో ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈ సమావేశంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, రాష్ట్ర సభ్యుడు నరహరి, ప్రసాద్, సుమన్, శ్రావణ్, శేఖర్, రాంజీ, రాజేశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## త్వరలో పింఛన్, ఆధార్ కార్డులు

నిజామాబాద్ : వృద్ధాశ్రమంలో పింఛన్, ఆధార్ కార్డులు లేనివారికి త్వరలో ఆర్డీవో ద్వారా వాటిని అందిస్తామని న్యాయసేవా సంస్థ కార్యదర్శి సూర్యచంద్రకళ అన్నారు. జిల్లా న్యాయసేవా సంస్థ భవన్‌లో నిజామాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌తో ఆమె సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో వున్న వృద్ధాశ్రమాల్లోని అనాథలు, పింఛన్, ఆధార్ కార్డు లేనివారి పూర్తి వివరాలు అందిస్తామని, వారికి ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారు. దీనికి స్పందించిన వినోద్‌కుమార్ తమ సిబ్బంది ఆశ్రమంలోకి వెళ్లి వారికి ఆధార్ కార్డులు, పింఛన్లు అందిస్తామని తెలిపారు. అలాగే త్వరలో న్యాయసేవా సంస్థ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో సీనియర్ సిటిజన్లకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తంగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణహిత-చేవెళ్ల పనులు నమూనా ప్రకారమే చేపట్టాలి

నిజామాబాద్ : మోపాల్ మండలం మంచిప్ప వద్ద నూతనంగా ప్రతిపాదించిన ప్రాజెక్టు నిర్మాణాన్ని రద్దు చేసి..గతంలో చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నమునా ప్రకారమే పనులు చేయాలని బాధితులు పలువురు డిమాండు చేశారు. మంచిప్ప-కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు గ్రామాల బాధితుల కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టరేట్‌కు వచ్చి ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొత్త డిజైన్‌తో నిర్మిస్తే అమ్రాబాద్ గ్రామ పంచాయతీలోని నాలుగు తండాలు, బైరాపూర్ పరిధిలోని నాలుగు తండాలు, మంచిప్ప గ్రామం కొంత భాగం పూర్తిగా ముంపునకు గురవుతుందన్నారు. తండాలో ఉన్న గిరిజనులు మొత్తం భూములు కోల్పోవలసి వస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రకారం నిర్మించవద్దని, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రకారమే నిర్మాణం చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. కమిటీ ఛైర్మన్ ఈశ్వర్ సింగ్, వైస్ ఛైర్మన్లు అజీం, భూపతిరెడ్డి, శంకర్, మోహన్‌సింగ్, సాయాగౌడ్, రవీందర్, గోవింద్‌తో పాటు పలు గ్రామాల వారు కలెక్టరేట్‌కు తరలివచ్చారు.

## కాల్వ పనుల్లో నాణ్యత డొల్ల

చిట్యాల : పిల్లాయిపల్లి కాల్వ ఆధునికీకరణ పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కంచర్ల భూపాల్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండ శ్రీశైలం అన్నారు. సుంకెనపల్లి శివారులో ఎగువభాగం నుంచి వచ్చిన వరదనీటితో కాల్వకట్ట తెగి పంటచేలు నష్టపోగా ఆవేదనకు గురై మృతిచెందిన ఆవుల నర్సింహ మృతదేహాన్ని వారు సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కాల్వ పనులను తమ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాల్వ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు మామిడి సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన రైతు కుటుంబానికి గుత్తేదారు పరిహారం చెల్లించే వరకు అంత్యక్రియలు నిర్వహించేదిలేదని మృతుని కుటుంబీకులు భీష్మించడంతో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కంచర్ల భూపాల్‌రెడ్డి గుత్తేదారు టి.విజయేందర్‌రెడ్డితో ఫోన్లో సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు ఆయన వద్ద మేనేజర్‌గా పనిచేస్తున్న మహ్మద్ సత్తార్ గ్రామానికి వచ్చి తమ లోపం వల్ల కాల్వకట్ట తెగి, ఆవేదనతో రైతు మృతిచెందడంతో మానవతా దృక్పథంతో మృతుని కుటుంబానికి రూ.4లక్షలు పరిహారంగా చెల్లిస్తామని ఒప్పంద పత్రం రాసి నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీశైలం, లక్ష్మయ్య, ఆవుల అయిలయ్యల సమక్షంలో మృతుడి కుటుంబీకులకు అందజేశారు.

## రైల్వేలను ప్రయివేటీకరిస్తే పెద్దఎత్తున ఉద్యమం




గద్వాల : రైల్వేలను ప్రయివేటీకరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అలా చేస్తే రైల్వే ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున ఉద్యమం చేయాల్సి వస్తుందని దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు అన్నారు.

గద్వాల రైల్వేస్టేషన్ వద్ద జరిగిన డివిజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే కార్మిక సంఘాల్లో మూడింట ి కి పార్టీలు నేతృత్వం వహిస్తుండగా, మజ్దూర్ యూనియన్ మాత్రం స్వతంత్రంగా ఉందన్నారు. కార్మికులందరి సమస్యల పరిష్కారమే యూనియన్ లక్ష్యమని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఆర్థికంగా చేయూత ఇస్తున్న ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. కార్మికుల కనీస వేతనాలు రూ. 18వేలు ఇవ్వాలని కోరితే రూ.9వేలకు పరిమితం చేయడం సరికాదన్నారు. సమావేశంలో సహాయ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, ఏఐఆర్‌ఎఫ్ జోనల్ కార్యదర్శి యుగంధర్, డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌రాజు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి కృష్ణ, గద్వాల శాఖ కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ శిబిరం ప్రారంభం

నిజామాబాద్ : 12వ తెలంగాణ బెటాలియన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో సీఏటీసీ-6 ఎన్‌సీసీ శిక్షణ శిబిరం రాజారాం స్టేడియంలో లాంఛనంగా ప్రారంభమైంది. ఇందులో ఆదిలాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, నిజామాబాద్ నాలుగు జిల్లాల నుంచి 600 మంది సీనియర్ (ఎస్‌డీ, ఎస్‌డబ్ల్యు), జూనియర్(జేడి, జేడబ్ల్యు) డివిజన్ల కేడెట్లు పాల్గొంటున్నారు.

వీరికి ఆర్మీ, నాన్ ఆర్మీ అంశాల్లో 10 రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రూప్ కమాండర్ కల్నల్ డి.కే.గుప్తా ముఖ్య అతిథిగా హాజరై కేడెట్ల గౌరవందనం స్వీకరించి ప్రారంభోత్సవ ఉపన్యాసం చేస్తారు. తదుపరి శిక్షణ కార్యక్రమాలు మొదలవుతాయి.

## నాగులవంచలో డీఎంహెచ్‌వో పర్యటన



చింతకాని : చింతకాని మండలం నాగులవంచలో జ్వరాల పరిస్థితి సాధారణ స్థితిలో ఉందని ప్రజలు భయాందోళనలు చెందాల్సిన పని లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.కొండల్‌రావు తెలిపారు. డీఎంహెచ్‌వో నాగులవంచ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో 20 రోజులుగా నడుస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డెంగీకి వైద్యం లేదన్నారు. నివారణే మార్గం అన్నారు. అందుకు ప్రజల సహకారం కావాలన్నారు. డెంగీ దోమ వృద్ధి చేసే లార్వా పెరగకుండా నివారించాలన్నారు. అందుకు వైద్య సిబ్బందితో, పాటు ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ, పంచాయితీరాజ్ శాఖ, గ్రామస్థులు సహకారం అందించాలని చెప్పారు. డెంగీ రోగులందరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని, వైద్య శిబిరానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామంలో 102 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి రక్త ఫలకీకలు పరీక్షలకు పంపినట్లు చెప్పారు. బోనకల్లులో ఉన్న ప్లేట్‌లెట్స్ యంత్రాన్ని వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సుబ్బారావుకు సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి రాంబాబు, సురేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరవధిక నిరాహార దీక్షలు విరమణ

ఖమ్మం : గ్రానైట్ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన 28 శాతం జీఎస్టీ పన్ను 5 శాతంకు తగ్గించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని.. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి సమస్య తీవ్రతను వివరిస్తామని భాజపా ప్రతినిధి బృందం హామీ ఇవ్వటంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులు నిరవధిక నిరాహార దీక్షను విరమించారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో జీఎస్టీ పన్ను తగ్గించాలనే డిమాండ్‌తో గ్రానైట్ పరిశ్రమల యజమానులు పారా నాగేశ్వరరావు, వేముల రవికుమార్, బాలాజీ ప్రసాద్, పాటిబండ్ల యుగంధర్, తమ్మినేని వెంకట్రావు, జొన్నలగడ్డ రవికుమార్, నజీర్, అశోక్ కొఠారి, కనకమేడల సత్యనారాయణ మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్ష శిబిరానికి భాజపా బృదంలో ఉప్పల్ ఎమ్మెల్యే ప్రభాకర్, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మారావు, భాజపా రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు సన్నే ఉదయ్ ప్రతాప్ చేరుకుని గ్రానైట్ పరిశ్రమల యజమానులతో సంప్రదింపులు జరిపారు. సెప్టెంబర్ 9 తేదీన అరుణ్‌జైట్లీ నేతృత్వంలో హైదరాబాద్‌లో జరగనున్న జీఎస్టీ మండలి సమావేశంలో గ్రానైట్ పరిశ్రమపై విధించిన జీఎస్టీ పన్ను 28 శాతాన్ని తగ్గించేలా తాము ఒత్తిడి పెంచుతామని ఉప్పల్ ఎమ్మెల్యే ప్రభాకర్ హామీ ఇచ్చారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు కేంద్ర మంత్రికి సమస్యను వివరించే ఏర్పాట్లు చేస్తామన్నారు. భాజపా నాయకులు నిమ్మరసం అందించి దీక్షలు విరమింపజేశారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు తాళ్లూరి మధుసూధన్‌రావు, గాయత్రి రవి, పుసులూరి నరేందర్, ఖాసీం, నవులూరి రవి, మాధవరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, వెంకట్‌బాబు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచౌక్‌లో గ్రానైట్ పరిశ్రమల యజమానులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కేంద్రం విధించిన జీఎస్టీ పన్ను 28 శాతం నుంచి 5 శాతంకు తగ్గించాలని వారు కోరారు. లేకుంటే గ్రానైట్ పరిశ్రమ దెబ్బతిని లక్షలాది మంది కార్మికులు ఉద్యోగ, ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన గ్రానైట్ పరిశ్రమల యజమానులు, ప్రతినిధుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, హైదరాబాద్ నగర కమిటీ అధ్యక్షుడు అజయ్‌కుమార్, వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, శరాబంది దీక్షా శిబిరానికి చేరుకుని నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు ప్రకటించారు.

## కుట్టు శిక్షణతో మహిళల్లో ఆత్మవిశ్వాసం



నారాయణపురం : కుట్టు శిక్షణతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఎస్ నారాయణ తెలిపారు. స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ సౌజన్యంతో సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణ పొందిన 150 మంది మహిళలకు సోమవారం ఆయన చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏఎస్ నారాయణ మాట్లాడారు. తాను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తినని, తన తల్లి కష్టపడి పనిచేస్తూ పట్టుదలతో నన్ను చదివించడంతో ఉన్నత స్థాయికి రాగలిగానని తెలిపారు. ఫ్లోరిన్ సమస్యగల గ్రామాలను ఎంపిక చేసుకొని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ సహకారంతో కుట్టు, అల్లికలు, కంప్యూటర్ కోర్సుల్లో మహిళలకు, నిరుద్యోగ యువజనులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన

**ఏఎస్ నారాయణ**

వారు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాంకుడోతు బుజ్జినాయక్, ఎంపీడీవో సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్‌కుమార్, ఏర్పుల అంజమ్మ, వడ్డపల్లి గోపమ్మ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, పద్మావతి, చిలువేరు హరిప్రసాద్, యాదయ్య పాల్గొన్నారు.

### 1995 నుంచి ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశాం

డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌టీ గ్రామీణ సంస్థ డైరెక్టర్

ప్రభుత్వం ద్వారా 1995లో ఏర్పాటైన తమ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ వృత్తులు అభివృద్ధి చెందినట్లయితే నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే పట్టణాలకు వలసలు తగ్గుతాయి. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకునేందుకు ఉచితంగా శిక్షణ పొందడానికి అవకాశం కల్పిస్తాం.

### మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

సాయిలక్ష్మి, ఎస్‌ఆర్‌టీ గ్రామీణ సంస్థ అసోసియేట్ ప్రొఫెసర్

మహిళలు తమ శక్తి యుక్తులతో, ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలి. ప్రస్తుతం కాలంలో ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలకు, చీరలకు, కుట్టు అల్లికలకు మంచి ఆదరణ పెరిగింది. అధునాతన పద్ధతిలో వస్త్రాలను తయారు చేసి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి.


విజయభాను

## సంపాదకీయం

## దేరా ఇష్టారాజ్యం!

రాజకీయ పెద్దలు దేరా మద్దతుతో ఓట్లు పొందుతున్నారే తప్ప, దేరా ప్రాతినిధ్యం వహిస్తున్న అట్టడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడటం లేదు. దేరా నాయకత్వం సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు సమర్థనీయం కాదు. కానీ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు దేరా ప్రాబల్యానికి మూల కారణాలను గుర్తించాలె. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సామాజిక పరివర్తనకు కృషిచేయడం తమ బాధ్యతగా భావించాలె. ఇద్దరు మహిళలపై లైంగిక అత్యాచారానికి పాల్పడిన దేరా సచా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఒక్కో కేసులో పదేండ్ల కారాగారం విధించడం వల్ల దేశంలో న్యాయం, ధర్మం ఉన్నాయనే భరోసా ప్రజలకు కలిగించినట్టయింది. అయినప్పటికీ ఆధ్యాత్మిక గురువుగా చలామణి అవుతున్న రామ్ రహీం సింగ్ పట్ల మెతకగా వ్యవహరించిన తీరు హర్యానాలోని బీజేపీ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసింది. దేశంలో చట్టబద్ధ పాలన సాగుతున్నదా అనే అనుమానాలకు తావిచ్చింది. హర్యానా ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో దోషిని చట్టం ముందు నిలబెడుతూనే, పరోక్షంగా ఆయనకు, ఆయన అనుచరగణాలకు సహకరించిన తీరు ఆక్షేపణీయంగా ఉన్నది. లైంగిక అత్యాచార కేసులో నిందితునిగా ఉన్న రామ్రహీం సింగ్ న్యాయస్థానానికి రెండు వందల వాహనాల బారుతో తరలివచ్చాడు. ఆయన దోషిగా నిర్ధారణ అయితే ఆయన అనుచరులు హింసకు పాల్పడుతారనేది తెలిసిన విషయమే. అయినా లక్షకు పైగా జనాలు హర్యానాలోని పంచ్‌కులాకు చేరడం ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తే తప్ప సాధ్యం కాదు. న్యాయస్థానం తీర్పు వెలువడిన తరువాత దేరా అనుచరులు పెద్ద ఎత్తున హింసా విధ్వంసాలకు పాల్పడుతూ ఉంటే, పోలీసులు అడ్డుకోకుండా పై నుంచి ఆదేశాల కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ దేరా ప్రాబల్యం పంజాబ్‌లో ఇంకా ఎక్కువగానే ఉన్నది. అయినా పంజాబ్ ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడగలిగింది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం కూడా అల్లర్ల నిరోధానికి సత్వర చర్యలు తీసుకున్నది. కానీ హర్యానాలో మాత్రం ప్రభుత్వమంటూ ఉన్నదా అనే సందేహం తలెత్తింది. రామ్రహీంసింగ్ దోషిగా నిర్ధారణ అయిన తరువాత కూడా ఆయనను బీజేపీ పెద్దలు కీర్తించడం ఆశ్చర్యకరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరి విశ్వాసాలు వారి కి ఉంటాయి. ప్రజల విశ్వాసాన్ని చూరగొని చలామణి అవుతున్న గురూజీలు, బాబాలు, స్వామీజీ లు అందరూ నిజంగా గొప్పవారని కాదు. ప్రజల ను తప్పుదోవ పట్టించి, తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారూ ఉన్నారు. అయినప్పటికీ వీరు నేరాలకు పాల్పడితే చట్టం ముందు నిలబెట్టడం తప్ప, ప్రజల విశ్వాసాలను తప్పుపట్టడం మాత్రం కుదరదు. భక్తి సంప్రదాయం కొనసాగింపుగా పం జాబ్‌లో చారిత్రకంగా దేరాలకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ఆధ్యాత్మిక గురువులుగా చలామణి అవుతున్న వారు నెలకొల్పిన చిన్నా పెద్దా దేరాలు పం జాబ్‌లో తొమ్మిది వేల వరకు ఉన్నాయి. కానీ దేరా సచా సౌదా వీటిలో అతి పెద్దది. హర్యానా కేంద్రం గా ఏర్పడిన ఈ దేరా పంజాబ్‌కు కూడా విస్తరించింది. ఈ రెండు రాష్ట్రాలలో బలమైన పునాదులు కలిగి ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో కూడా భక్తుల ను ఆకర్షించగలిగింది. ఈ దేరా మద్దతు కోసం రా జకీయ పక్షాలు పాకులాడటం మొదలుకావడంతో దీని అధిపతి రామ్రహీం సింగ్‌కు ఎదురులేకుండా పోయింది. గత ఎన్నికలలో ఈ దేరా బీజేపీకి మద్దతు ప్రకటించింది. కానీ ఈ దేరాకు ఉన్న ప్రాబల్యం దృష్ట్యా బీజేపీ పెద్దలు వీరి కార్యకలాపాల పట్ల చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రాజకీయ మద్దతుతో దేరా అనుచరులు ఎంతగా పేట్రేగిపోతున్నారో గత నాలుగైదు రోజుల ఘటనలను బట్టి తెలుస్తున్నది. శాంతి భద్రతలు అదుపు తప్పుతాయనే భయంతో, దోషిని బంధించిన జైలు ప్రాంగణంలోనే తాత్కాలిక న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసి, న్యాయమూర్తిని అక్కడికి తరలించి తీర్పు ఇవ్వవలసి వచ్చింది. జైలు చుట్టూ అంచెలంచెలుగా రెండు వేల మందికి పైగా సైనికులు కాపలా కాస్తున్నారు. మత విశ్వాసాల పేరిట హింసకు పాల్పడితే సహించబోమని ప్రధాని మోదీ అంటున్నారు. కానీ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని దేశవ్యాప్తంగా ఘటనలను బట్టి తెలిసిపోతున్నది. పదిహేనవ శతాబ్ది భక్తి కవి రవిదాస్ స్ఫూర్తి, 1920 దశకంలో మొగ్గ తొడిగిన ఆది ధర్మి ఉద్యమం, దళితుల ఆత్మగౌరవ పోరాటం వేసిన పునాదులు దేరా సచా సౌదా పంజాబ్‌లో విస్తరించడానికి దోహదపడ్డాయి. జాట్‌లకు పట్టుగొమ్మ అయిన మాల్వా ప్రాంతంలో దళితు లు సమీకృతం కావడానికి ఈ దేరా వేదికగా మారింది. గుర్మీత్ రామ్రహీం సింగ్ నిజాయితీ, ఈ దేరాలో సాగుతున్న కార్యకలాపాలు అనుమానాస్పదం కావచ్చు. కానీ ఈ దేరా దళితుల అభిమానాన్ని ఇంతగా చూరగొనడానికి గల కారణాలను అధ్యయనం చేయాలె. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా చాలా రాష్ట్రాలలో ఆధిపత్య పోకడలు పోలేదు.

# పోటెత్తిన నైరుతి



బెంగళూరు : ఆలస్యంగానైనా నైరుతి రుతు పవనాలు జోరందుకున్నాయి. కన్నడనాడును తడిసి ముద్దయ్యేలా చేస్తున్నాయి. దక్షిణ, మధ్య కర్ణాటకలో జోరువానలు సందడి చేస్తున్నాయి. కొడగు జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తోంది. ఇది కావేరీ మాతకు ఉపకరించే అంశం. మడికేరి ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యగా విద్యా సంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. జిల్లాకేంద్రం మడికెరి పట్టణంలో అత్యధికంగా తొమ్మిది సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాబోయే రెండు రోజుల్లో ఓమోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాల వివరాల్లోకెళ్తే (సెంటీ మీటర్లలో).. సుళ్య, మంకి, సైదాపుర- 7, పణంబూరు, బంట్వాళ, హొన్నావర, కద్ర, హుమ్నాబాద్, భాగమండల- 6, ముల్కి, జగల్‌బెట్ట- 5, మూడబిద్రి, పుత్తూరు, కోట, కార్కళ, శిరాళి, ఉడుపి, నాపోక్లు, శృంగేరి- 4, లోండా, తాళగుప్ప, విరాజ్‌పేట, లింగనమక్కి- 3, పొన్నంపేట, సోమవారపేట ప్రాంతాల్లో రెండు సెంటీమీటర్ల వర్షం కురిసింది. బెంగళూరులో ఆకాశం మేఘావృతంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

## 'కాలుష్య సమస్యను పరిష్కరించండి'

కోయంబత్తూరు : కాలుష్య సమస్యను పరిష్క రించాలని అరసూరు, పొత్తియంపాలెయానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు వారు కోయంబత్తూరు కలెక్టరుకు వినతి పత్రాలు సమర్పించారు. సూలూరు ప్రాంతంలోని ఓ సంస్థ ఇటీవల కార్యకలాపాలు నిలిచిపోయినా అక్కడ పేరుకున్న వ్యర్థాల వల్ల కాలుష్య సమస్య తలెత్తిందని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి కూడా సరైన చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. వాయు, జల కాలుష్యానికి కారణమవుతున్న ఆ సంస్థ అనుమతిని రద్దు రద్దు చేయాలని కోరారు

# రాజధానిలో రాచమార్గాలు!



బెంగళూరు: రాజధాని నగరంలోని రహదారులను మరింత యోగ్యంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం రూ.397 కోట్లు వ్యయం చేయనుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన ఇక్కడ విధానసౌధలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసు కున్నారు. న్యాయ, సభా వ్యవహారాల మంత్రి జయచంద్ర మాధ్యమ ప్రతినిధులకు ఆ వివరాలు వెల్లడించారు. నగరంలోని సుబేదార్ చత్రం, గుబ్బి తోటదప్ప, ధన్వంతరి రహదార్లు, సుభాష్ నగర్, గాంధీనగర్‌లోని మరి కొన్ని మార్గాలను టెండర్‌ష్యూర్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు రూ.105 కోట్లు వ్యయం చేయనున్నారు. ఇంకా ఎంపిక చేసిన మరిన్ని మార్గాలను సిమెంటు బాటలుగా పరివర్త చేసేందుకు రూ.292 కోట్లు ఖర్చు చేయ దలచినట్లు జయ చంద్ర వివరించారు. మంత్రివర్గ సమావేశంలో ఇతర నిర్ణయాలు..

నగర శివార్లలోని బెంగళూరు అంత ర్జాతీయ వస్తు ప్రదర్శన శాల వద్ద అండర్ పాస్ నిర్మాణానికి రూ.165 కోట్లు మంజూర్చు. మైసూరు, బెళగావి, కలబురగిల్లో సూపర్ స్పెషాలిటి వైద్యాలయాల నిర్మాణం. అక్కడ ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా వీటిని నిర్మిస్తారు. మైసూరు కృష్ణ రాజేంద్ర ఆస్పత్రిలో రూ.123.77 కోట్ల వ్యయంతో కొత్త భవనాన్ని కడతారు. చికిత్స ఉపకరణాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.32.25 కోట్లు కేటాయించారు.

బెళగావి, కలుబురగి వైద్య విజ్ఞాన సంస్థల ఆవరణల్లో వరుసగా రూ.140బీ రూ.107 కోట్ల ఖర్చుతో భవనాల్ని నిర్మిస్తారు.

# భారతీయులకు 'హార్వీ' కష్టాలు



హూస్టన్: అమెరికాలో హార్వీ హరికేన్ ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలకు తోడు భారీ వరదలు టెక్సాస్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. తాజాగా టెక్సాస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్‌లోకి వరద నీరు చొచ్చుకురావడంతో దాదాపు 200 మంది భారతీయ విద్యార్థులు క్యాంపస్‌లో చిక్కుకున్నట్లు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ట్వీటర్‌లో తెలిపారు. షాలిని, నిఖిల్ భాటియా అనే విద్యార్థులను ఆస్పత్రిలో చేర్చినట్లు చెప్పారు. అక్కడి భారత కాన్సుల్ జనరల్ అనుపమ్ రే సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

సహాయక చర్యలకు బోట్లు అవసరం కావడంతో, విద్యార్థులకు బోట్ల ద్వారా ఆహారం అందించాలన్న తమ ప్రతిపాదనను అమెరికా తీరరక్షక దళం తిరస్కరిం చిందన్నారు. మరోవైపు స్థానిక అధికారులు మాట్లాడుతూ వర్సిటీలో చిక్కుకున్న విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. స్థానిక భారతీయ అమెరికన్లు బాధితులకు ఆహారం, ఇతర వస్తువులు సమకూరు స్తున్నట్లు పేర్కొన్నారు. హార్వీ హరికేన్ ప్రభావంతో అతలాకుతలం అవుతున్న లూసియానా రాష్ట్రంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. హార్వీ ఉధృతికి ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న టెక్సాస్ రాష్ట్రాన్ని ట్రంప్ వ సందర్శిస్తారని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి శాండర్స్ తెలిపారు.

# ఆరు కాళ్ల దూడ జననం

కారటగి : కొప్పళ జిల్లా కారటగి సమీప సాలుంచిమర క్యాంపులో ఆరుకాళ్ల లేగదూడ జన్మించింది. రైతు తమ్మి నీడి నాగేశ్వరరావుకు చెందిన ఆవు మొదటి ఈతలో ఆరు కాళ్ల మగదూడకు జన్మనిచ్చింది. ఆవు, దూడ ఆరోగ్యంగా ఉన్నాయి. దీనిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలు, క్యాంపుల రైతులు అధిక సంఖ్యలో వస్తున్నారు. జన్యు లోపం వల్ల ఇలాంటివి జరుగుతాయని పశువైద్యులు తెలిపారు.

## కవి సమయం

### ఇప్పటికి నమ్ముతున్నాను

అందాల భవిష్యత్తు పొగచూరినా
అయిన వాళ్లూ అనుకున్నవాళ్లూ
పుర్ర చెయ్యి చూపించినా
కమ్మని కలల పాల పొదుగు
కటిక కన్నీళ్లు చేపినా
ఇంకా ఏదో మిగిలి వుందని
ఏ అనుబంధమో లంకె వేసుకుందని
ఎన్నెన్ని గాయాలైనా హృదయం
ఇంక పచ్చగానే వుందని
ఇప్పటికి నమ్ముతున్నాను
కలిమి కొలిమి నిప్పులు కురుస్తున్నా
లేకితనం బంటబట్టిన లోకం
లేచి లేచి జబ్బలు చరుస్తున్నా
ఇంకా ఏదో మూల్గు వుందని
ఏ స్నేహదీపమో వెల్గుతుందని
ఇంతటి చిమ్మ చీకటి సంతలో
వెలుగుల తొలికేన విరియనుందని
ఇప్పటికి నమ్ముతున్నాను


...కవితా రచన
తుంపాల శ్రీరామమూర్తి
సెల్ నెం: 9440260280

# పంచాంగం

మాసం : భాద్రపద; తిథి: నవమి తె.4.20; జ్యేష్ఠ రా.2.15; ఉ.శే.వ.7.40వ

బుధవారం 30-08-2017

**మేషం** : నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. **మిథునం** : కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయా లకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది. ఖర్చులు అధికమవుతాయి. ఉమ్మడి వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగ దాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొం టారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. **వృశ్చికం** : ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. **ధనుస్సు** : మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం** :భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయ మనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **మీనం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగు మతులు లాభిస్తాయి.



# శక్తి పుణ్యక్షేత్రం...పావగఢ్ శక్తి పీఠం

## సంకీర్తన

గుజరాత్ రాష్ట్రంలోని ప్రధానమైన మూడు శక్తి పీఠాలుగా అరసుర్‌లోని అంబాజీ, చున్వల్క్ చెందిన బాల మరియు చంపనేర్‌కు సమీపంలోని పావగఢ్‌లను ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంటారు.

కచ్‌లోని అసపురా, మౌంట్ ఆబూక్కు చెందిన అర్బుదదేవి, హల్వాడ్‌లోని సుందరీ, హర్‌సిద్ధికి చెందిన కోల్‌గిరి లేదా కోయ్‌లా మరియు నర్మదా తీరాన అనసూయలు గుజరాత్‌లోని ఇతర శక్తి పుణ్య క్షేత్రాలుగా భక్తుల పూజలను అందుకుంటున్నాయి.

ఈ పావగఢ్... గుజరాత్‌కు ఒకప్పటి రాజధానిగా పేరొందిన చంపనేర్‌కు సమీపంలో వడోదరాకు 50 కి.మీ.ల దూరంలో పావగఢ్ శక్తి పీఠం నెలకొంది.

దక్షయజ్ఞ విధ్వంసం, శివుని రుద్ర తాండవం సందర్భంగా సతీ దేవీ దేహ భాగాలు భారతదేశంలోని పలు ప్రాంతాలలో పడ్డాయి. అటువంటి ప్రాంతాలు శక్తి పీఠాలుగా ప్రాచుర్యాన్ని పొందాయి. అదే సమయంలో సతీ దేవీ ఎడమ వక్ష భాగం ఇక్కడ పడిందని భక్తుల విశ్వాసం. వార్షిక నవరాత్రి ఉత్సవాలలో పర్వతంపై కొలువైన ఈ దేవాలయం భక్తులను పెద్దసంఖ్యలో ఆకర్షిస్తుంది.

ఏకాంతంగా కనిపిస్తూ, అన్ని వైపులా చల్లని గాలులను వెదజల్లే పర్వతంగా ప్రజలను ఆకట్టుకోవడంతో ఈ పర్వతానికి పావ్‌గఢ్ అనే పేరు సార్థకమయ్యింది. పురాణేతిహాసాలను అనుసరించి పావ్‌గఢ్‌ను ఆవరించిన లోయ విశ్వామిత్రుని శక్తితో నిండి ఉంటుంది.

అంతేకాక ఇక్కడి కాళికా మాత విగ్రహాన్ని విశ్వామిత్రుడు ప్రతిష్టించాడని పురాణాలు చెప్తున్నాయి. విశ్వామిత్రి నది ఇక్కడనే ఆవిర్భవించింది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఆత్మహత్యలే పరిష్కారం కాదు




ఖమ్మం : మానవ జీవితం ఎంతో విలువైనదని.. ఆత్మహత్యలతో నూరేళ్ల ఆయుష్షును ముగించుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండల్‌రావు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2017 సంవత్సరంలో ఒక్క నిమిషం ఆలోచనతో జీవితాన్ని మార్చుకో అనే నినాదంతో ప్రజలను చైతన్య పరిచాలని సూచించిన నేపథ్యంలో జాతీయ ఆత్మహత్యల నివారణ సంస్థ కరపత్రాలను ముద్రించింది. జిల్లా వైద్య ఆరోగ్య సంస్థ కార్యాలయంలో సంస్థ ప్రతినిధి డాక్టర్ సతీష్‌బాబుతో కలిసి డీఎంహెచ్‌వో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలను మేల్కొలిపేందుకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రాంబాబు, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, ఐఎంఏ కార్యదర్శి బొల్లికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వాల విధానాలతో తగ్గుతున్న సాగు

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి

పాలమూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల సాగు రోజురోజుకు తగ్గిపోతోందని, వ్యవసాయంపై రైతులు కూడా ఆసక్తి చూపని పరిస్థితి నెలకొందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రతినిధుల సభ రెండో రోజు సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వాలు సంస్కరణలు తేకపోవడం, మేలు రకమైన వంగడాలను, ఆధునాతన వ్యవసాయ పద్ధతులను రైతులకు కల్పించకపోవడం, పంటకు అవసరమైన సాగునీటికి అందించకపోవడం, ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడంతో రైతులు వ్యవసాయంపై అయిష్టత చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు నూతన వ్యవసాయ విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజిలయ్యగౌడ్, వెంకట్రాంరెడ్డి, నాయకులు ఏ.రాములు, ఆర్ రాంరెడ్డి, చంద్రకాంత్, రమేష్, రాము, విష్ణు, తిరుమలయ్య, పాల్గొన్నారు.

# ఇక వ్యవసాయ శాఖ బలోపేతం

ఎర్రుపాలెం : వ్యవసాయ శాఖ బలోపేతంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతీ మండలంలో ఏర్పాటు చేసిన క్లస్టర్‌లలో ఏఈవోలకు నూతనంగా కార్యాలయాలు, ప్రత్యేక గోదాములు, రైతులకు సమావేశ మందిరాల నిర్మాణాలు ఒకే భవనంలో చేపట్టనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 2500 క్లస్టర్‌లలో నూతనంగా నిర్మాణాలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఈమేరకు అన్ని జిల్లాలో స్థల సేకరణ చేసేందుకు రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. వ్యవసాయ శాఖలో ఏర్పాటు చేసిన క్లస్టర్‌ల ద్వారా 2500 ప్రాంతాల్లో ఒకేచోట నిర్మించే భవనంలో ఏఈవో కార్యాలయం, చిన్న గోదాము, సమావేశ మందిరము నిర్మించ నున్నారు. ఖమ్మం జిల్లాలో 102 క్లస్టర్‌లు ఉండ గా 78 క్లస్టర్‌లకు 78 మంది ఏఈవోలు పని చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 60 క్లస్టర్‌లకు 43 క్లస్టర్‌లలో 43 మంది ఏఈవోలు విధుల్లో ఉన్నారు.

మధిర నియోజకవర్గంలో ఐదు మండ లాల్లో 26 క్లస్టర్‌లలో వీటి నిర్మాణాలు జరుగనున్నాయి.

# తగ్గని తాలిపేరు

చర్ల : చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులో వరద ప్రవాహం అలానే కొనసాగుతోంది. ప్రాజెక్టులో 10 గేట్లు ఎత్తివుంచి 35 వేల క్యూసెక్కుల చొప్పున వరద నీటిని దిగువ గోదావరికి విడుదల చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి ఏమాత్రం తగ్గని తాలిపేరు సాయంత్రానికి కాసింత తగ్గుముఖం పట్టింది. దీంతో నీటిమట్టం నిలకడగా ఉంది. జలాశయంలో 73.60 మీటర్ల స్థాయి నుంచి 72 మీటర్ల వరకు నీటిమట్టం తగ్గింది. ఎగువ ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణ సరిహద్దులో కురుస్తున్న వర్షాలకు జలాశయం ఎగువనున్న చింతవాగు, రోటెంతవాగులు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండటంతో నాలుగు గేట్లను పూర్తిస్థాయిలో(ఫ్రీఫ్లోలో) ఎత్తివుంచి వరద నీటిని దిగువకు పంపిస్తున్నారు. మరోపక్క దిగువ పగిడివాగులోను నీటి ప్రవాహం భారీగా పెరగడంతో తేగడ వద్ద తాలిపేరు ఉగ్రరూపం దాల్చింది.

ఇక్కడున్న లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు గోదావరిలో కలిసేందుకు ఉరకలు పెడుతోంది. ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా తెలుసుకుంటూ అందుకు అనుగుణంగా ఆదేశాలు ఇస్తున్నారు.

ప్రాజెక్టు వద్ద డీజిల్ నిల్వలను సిద్ధంగా ఉంచారు. ఎగువ నుంచి వరద నీరు మరింతగా పెరిగితే మరికొన్ని గేట్లు లేపాలని అధికారులు సిబ్బందికి సూచించారు. మండలంలో విస్తారంగా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాలిపేరు ప్రాజెక్టులో వరద పరిస్థితి ఈఈ ప్రసాద్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

# గోదాముల సామర్థ్యం పెంచుతాం

భువనగిరి : రాష్ట్రంలో ధాన్యం, ఇతర వ్యవసాయ దిగుబడులను దృష్టిలో పెట్టుకుని అదనంగా గోదాముల నిర్మాణానికి తమ సంస్థ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ మందుల సామేల్ తెలిపారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో ఖమ్మం, నల్గొండ, పాల్వంచలో 32వేల టన్నుల సామర్థ్యంగల గోదాముల నిర్మాణం చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదాముల నిర్మాణంలో అప్పటి పాలకులు వివక్ష చూపారని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కార్మికులు, హమాలీల కోసం రాష్ట్రంలో 87 గోదాముల్లో రూ.3.18 కోట్లతో కనీస వసతులు కల్పిస్తోందన్నారు. గత ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల కందుల దిగుబడి రాగా, కర్ణాటక, మహారాష్ట్రకు ఎగుమతి చేశామని చెప్పారు ప్రస్తుతం 78వేల మెట్రిక్ టన్నుల కందులు నిల్వ ఉన్నాయన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పంతులు నాయక, వైస్ ఛైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గోమారి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగారం అంజయ్య, మొలుగు లక్ష్మయ్య, కంచెనపల్లి నర్సింహరావు, పుట్ట వీరేశ్ పాల్గొన్నారు. తొలుత ఆయన కిసాన్‌నగర్‌లోని గోదాంలో మొక్క నాటారు.

సామెల్ భువనగిరికి వచ్చిన సందర్భంగా తెరాస నాయకులు ఆయనను సన్మానించారు. స్థానిక రహదారి బంగ్లాలో నాయకులు నాగారం అంజయ్య, మొలుగు లక్ష్మయ్య సత్కరించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పంతులు నాయక్, వైస్‌ఛైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గోమారి సుధాకర్‌రెడ్డి, నాయకులు నర్సిరెడ్డి, పుట్ట వీరేశ్, నాగభూషణం, నర్సింగ్ రావు కౌన్సిలర్లు లయాక్ అహ్మద్, రాచమల్ల రమేశ్ పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

నందిపేట్ : మహనీయులు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో ఆయన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ...అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి హక్కులు కల్పిస్తే జగ్జీవన్‌రామ్ దానిని అమలు చేస్తూ దళితులకు ఎంతో మేలు చేశారన్నారు. వారు కలలుగన్న సమాజం కోసం పాలకులు కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, గత మూడు సంవత్సరాల్లో వందల మంది దళితులపై అత్యాచారాలు, హత్యలు జరిగాయని, అయినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. హత్యలను ప్రమాదాలుగా చిత్రీకరిస్తూ నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రివర్గంలో దళితులకు చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. తక్కువ శాతం ఉన్న ప్రజలకు అందలం ఎక్కిస్తూ 15శాతం ఉన్న దళితులను దూరంగా నెట్టివేయడం సరికాదన్నారు. ఇకనైనా పాలకులు ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారాంయాదవ్ మాట్లాడుతూ దేశ జనాభాలో సగమైన మహిళల హక్కుల కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని, వారికి ఆస్తి, ఇతర హక్కులు కల్పించారన్నారు. సర్పంచి దొబ్బల రాజు, ఉప సర్పంచి వన్నెల్‌దాస్ శేఖర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు రమేష్, మైలారం బాలు, సరికెల పోశెట్టి, కలిగోట్ సంతోష్, స్థానిక నాయకులు దొబ్బల సంతోష్, మహిమూద్, సాయన్న, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో తుమ్మల పర్యటన

ఖమ్మం : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం గ్రామీణ మండలం నాయుడుపేట క్రాస్‌రోడ్డులో నిర్వహించే పార్టీ సమావేశంలో పాల్గొంటారు. 31వ తేదీ ఉదయం 11 గంటలకు ఇల్లెందు మండలం లచ్చగూడెంలో నిర్వహించే హరితహారం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు దమ్మపేట మండలం అంకమ్మపాలెంలో నిర్వహించే నియోజకవర్గ సమావేశానికి హాజరవుతారు. అనంతరం నూతనంగా నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను ప్రారంభించనున్నట్లు క్యాంపు కార్యాలయవర్గాలు తెలిపాయి. పంచాయతీ సమరానికి సన్నద్ధం

# జూరాలకు స్థిరంగా వరద ప్రవాహం

ధరూర్ : జూరాల జలాశయానికి వస్తున్న వరద నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగి స్థిరంగా కొనసాగుతోంది. వరద నీటి ప్రవాహం ఉదయానికి 2,210 క్యూసెక్కుల వరకు ఉంది. జూరాల అధికారుల సమాచారం మేరకు.. జలాశయంలోకి నుంచి 2,574 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి కుడి, ఎడమ కాల్వల కింద ఆయకట్టు కోసం 2,025 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయంలో నీటి నిల్వ కూడా 5.98 టీఎంసీల నుంచి 6.034 టీఎంసీలకు పెరిగింది. అటు ఆల్మట్టి జలాశయానికి కూడా వరద నీటి రాక పెరిగింది. జలాశయంలోకి 2,0792 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. జలాశయం నుంచి 11,023 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు నారాయణ్‌పూర్ జలాశయంలోకి 9,68 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. పంట కాల్వలకు 10,217 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆల్మట్టిలో 123.67, నారాయణ్‌పూర్‌లో 33.51 టీఎంసీల నిల్వ ఉంది.

# తెలంగాణ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

నిజామాబాద్ : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు తెలంగాణ స్టడీ సర్కిల్‌లో బీఎస్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి, స్టడీ సర్కిల్ ఇన్‌ఛార్జి అధికారి మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో స్టడీసర్కిల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చే నెల 8వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు అక్టోబరు 3 వ తేదీ నుంచి కొనసాగుతాయని, ఆరు నెలల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల 17న పోటీపరీక్ష నిర్వహించి 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

# త్వరితగతిన పరిష్కరించాలి



గద్వాల : జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విజయ్‌కుమార్ ఆదేశించారు. ప్రజావాణి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి 18 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గట్టు మండల కేంద్రానికి చెందిన రీనా బేగం తన భర్త ముజాహిద్ ఏ పనీ చేయకుండా తాగి వచ్చి డబ్బులు ఇవ్వమని వేధిస్తున్నాడని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మల్దకల్ మండలం మద్దెలబండతండాకు చెందిన రాములునాయక్ అదే గ్రామానికి చెందిన తన అల్లుడు, అతని తండ్రి రాత్రి ఇంటిమీదకు వచ్చి దాడి చేశారని, చంపుతామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరించాలని డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను ఎస్పీ ఆదేశించారు. సివిల్ ఫిర్యాదులను సివిల్ కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

# మినీ మైదానానికి ఎకరా స్థలం అందజేత

### శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి ఉదారత

మహబూబ్‌నగర్ : జిల్లాలో క్రీడల నిర్వహణకు తనవంతు తోడ్పాటు అందించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు.

ఆయన కలెక్టర్ రొనాల్డ్ రోస్‌ను కలిసి చిన్నచింతకుంట మండలంలోని అల్లీపురం గ్రామంలో ప్రభుత్వ సహకారంతో మినీ స్టేడియం వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టు, ఆడిటోరియం నిర్మాణాలకుగాను సర్వే నంబరు 156, 228లో ఉన్న తన ఎకరా భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అందజేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అల్లీపురం గ్రామంలో మినీ మైదానం ఇతర క్రీడల నిర్వహణకు అవసరమైన చేపట్టాల్సిన కార్యక్రమాలకు ప్రభుత్వం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఎకరా పొలం అందిస్తున్న అంగీకార పత్రం కలెక్టర్‌కు అందజేశారు. జేసీ శివకుమార్‌నాయుడు, నారాయణపేట ఉప కలెక్టర్ కృష్ణఆదిత్య, యువజన, క్రీడల అభివృద్ధి అధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# బైపాస్ రహదారి కోరుతూ కేంద్రమంత్రికి వినతి

సత్తుపల్లి : ఖమ్మం- అశ్వారావుపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సత్తుపల్లికి బైపాస్ రహదారి కోరుతూ స్థానిక భాజపా నాయకులు దిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖామంత్రి బండారు దత్తాత్రేయకు వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లికి చెందిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూసంపూడి రవీంద్ర, స్థానిక పార్టీ అధ్యక్షులు భుక్యా శ్యామ్ సుందర్‌నాయక్ తదితరులు వినతిపత్రం అందజేశారు. పట్టణం నుంచి జాతీయ రహదారి విస్తరణ చేయడం వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. తమ లేఖను కేంద్ర రహదారుల శాఖామంత్రి నితిన్‌గడ్కరి, జాతీయ రహదారుల విస్తరణ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని దత్తాత్రేయ తమకు హామీ ఇచ్చారని వారు తెలిపారు.

### ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా

# అమలుకాని యంత్రలక్ష్మి పథకం

### పరికరాలు, యంత్రాలకు ఎదురుచూపులు



నిజామాబాద్ : యాంత్రీకరణకు 50 శాతం రాయితీ ఇవ్వాలి. అయితే లబ్ధిదారుల్లో దాదాపు అందరూ ట్రాక్టర్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ఒక్కో వాహనం ధర ఒక్కో రకంగా ఉంటుంది. దీంతో గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈసారి జీఎస్‌టీ ప్రభావంతో అది రూ.3.50 లక్షలకు గరిష్ఠ రాయితీగా నిర్ణయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే దేనికి ఎంత వెచ్చించాలనేది సర్కారు ముందే నిర్ణయిస్తుంది. అలాగే ఈసారి కూడా అన్ని పరికరాల ధరలను ఖరారు చేసింది. కానీ యంత్రాలకు సంబంధించి ఎంత రాయితీ ఇవ్వాలనే దానిపై సందిగ్ధంలో పడింది. ఈసారి కూడా నిధులొచ్చి నాలుగు నెలలవుతుంది. ఇప్పటికే దరఖాస్తులు వెల్లువెత్తాయి. లబ్ధిదారుల జాబితా సిద్ధమైంది. కానీ యూనిట్లు మంజూరుకు మాత్రం మోక్షం కలగలేదు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా యంత్రలక్ష్మి మాత్రం కరుణించడం లేదు.

2017-18 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర సాధారణ నిధుల(ఎన్‌ఎస్‌సీ) నుంచి జిల్లాకు రూ. 8.71 కోట్లు వచ్చాయి. వీటిని యాంత్రీకరణకు ఉపయోగించవలసి ఉంది. ఈ పాటికే 215 మంది దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. సంబంధిత దస్త్రం కూడా ప్రభుత్వమోదం పొందింది. అయితే యూనిట్లు మంజూరు చేయడమే ఆలస్యం. కానీ మూడు నెలలు గడిచినప్పటికి ఇంకా యంత్ర పరికరాలు లబ్ధిదారులకు చేరలేదు. ఖరీఫ్ సీజన్ ముగిసి మరో నెల రోజుల్లో రబీ సీజన్ రానుంది. కనీసం ఆ పంట వరకైన యంత్రలక్ష్మి చేతికందించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. ఇటీవల జీఎస్‌టీ పన్నుల్లో వ్యవసాయ యాంత్రీకరణలో ప్రధానంగా వినియోగించే ట్రాక్టర్, దాని పరికరాలకు భారీగా పన్నులు పెంచారని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. జీఎస్‌టీ పన్నుల భారాన్ని కేంద్రం తగ్గించే యోచనలో ఉన్నందున రాయితీ ధరల నిర్ణయం ఆలస్యమవుతుందని తెలుస్తోంది.

2016-17 సంవత్సరానికి సంబంధించిన యంత్రలక్ష్మి నిధులను చివరి ఘట్టంలో వినియోగించారు. కమిషనరేట్ నుంచి నేరుగా వచ్చిన లబ్ధిదారుల జాబితాకు అనుగుణంగానే పంపిణీ ప్రక్రియ చేపట్టారు. మార్చి నెల దాటితే నిధులు తిరిగి వెళ్తాయనే భావనతో అగమేఘాల మీద ఖర్చు చేశారు. అప్పుడు మంజూరైన యూనిట్లను మార్చి 31 రాత్రి 11.30 గంటల వరకు కూడా ప్రొసీడింగ్ పత్రాలు అందజేసినట్లు సమాచారం. మళ్లీ కేంద్ర ప్రభుత్వం ద్వారా అందే కృషి వికాస్ యోజన కింద కూడా గతేడాది పూర్తి స్థాయి నిధులను కూడా సకాలంలో ఖర్చు చేయలేకపోయారు. మళ్లీ తాజాగా ఈ నెలలోనే 16 మందికి యంత్రలక్ష్మి కింద రూ.64 లక్షల నిధులను వినియోగించారు.

అయితే లబ్ధిదారులకు మాత్రం రాయితీ గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రావడం గమనార్హం. ఈ ఏడాది నుంచి మాత్రం రూ.50 వేల తక్కువకు రాయితీని కుదిస్తున్నట్లు తెలియవస్తోంది.

ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీ యాంత్రీకరణలో ఒక్కో పంట వారీగా యంత్రాల సేవా కేంద్రం (సీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ శాఖ దీనికి శ్రీకారం చుట్టనుంది. అందులో భాగంగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, సోయాబీన్, వరి నూర్పిడి యంత్రాలను ఈ సేవా కేంద్రాలకే అప్పజెప్పాలని భావిస్తున్నారు. తాజాగా చెరుకు సాగుకు ఉపయోగించే యంత్రాలపై 75 శాతం రాయితీ ఉండేది. దానిని ఇప్పుడు 50 శాతానికి కుదించారు. దీని పంపిణీ బాధ్యతను చక్కెర శాఖ నుంచి వ్యవసాయశాఖకు మార్చారు. ఏఏ యంత్రానికి ఎంత గరిష్ఠ రాయితీ ఇవ్వాలనేది ఖరారైంది. మొక్కజొన్న యంత్రానికి రూ. 15 లక్షలు, వేరుశనగ యంత్రానికి రూ.7.50 లక్షలు, పత్తి యంత్రాలకు రూ. 5 లక్షలు, సోయాబీన్ పంట యంత్రాలకు రూ.15 లక్షలు, వరి నూర్పిడి యంత్రానికి రూ. 12.50 లక్షల వరకు రాయితీ ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. ఒక్క యంత్రలక్ష్మి పథకంలో ఇచ్చే ట్రాక్టర్ల విషయంలోనే ఇంకా సందిగ్ధత నెలకొంది.

# దేవ దేవుడు.. శ్రీ వేంకటేశుడు

**'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి'**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూతకాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం 'కలియుగ వైకుంఠ'మని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాదుతేమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయంభూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణి? శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడ్కైన శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి 'ఆనంద నిలయ'మనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

స్థలపురాణం

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిరపేంచిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహాద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణవనం అధిపతులు ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవ్కై, విజయనగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహరాయలు, శ్రీకృష?దేవరాయలు, తిరుమలరాయలు, అచ్యుతరాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అదుతే నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంకర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడ్కైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థలపురాణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరుపతిలో పద్మావతి/బీబీనాంచారి/అలివేలుమంగ అమ్మవారిని, గోవిందరాజస్వామి వారిని దర్శించుకోవాలి. తిరుమలగిరులలో ఉన్న పవిత్ర ఆకాశగంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం..వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మిక-పర్యాటక ప్రాశస్త్యమున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహనాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కుబడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి 'కల్యాణకట్ట' వద్దనే తలనీలాలు సమర్పించాలి

శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శనవేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది.

టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈ-దర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయంలోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రితమవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

**వృద్ధులకు, వికలాంగులకు దర్శన వేళలు:**

శ్రీవారి దర్శనానికి వచ్చే వికలాంగులు, వృద్ధులకు తితిదే ప్రత్యేక ప్రవేశ అవకాశం కల్పిస్తోంది. మందిరం మహాద్వారం సమీపం నుంచి ఆలయంలోకి చేరుకునే సౌలభ్యం కల్పించింది. నిత్యం ఉదయం 10, మధ్యాహ్నం 3గంటలకు ఆలయ ప్రవేశాలకు అనుమతిస్తుంది. ఈ దర్శన సమయాల కన్నా గంట ముందుగా ఆయా భక్తులు పరిశీలనకు హాజరవ్వాల్సి వుంటుంది. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులకు వయస్సు ధ్రువీకరణ పత్రం ఆధారంగా అనుమతిస్తారు. నడవలేని పరిస్థితిలో ఉన్నవారి వెంట సహాయకులను అనుమతిస్తారు. వికలాంగులు, గుండె జబ్బుతో ఆపరేషన్ చేసుకున్న భక్తులను వ్కెద్యులు జారీచేసి పత్రాల పరిశీలన అనంతరం అనుమతిస్తారు. బ్రహ్మోత్సవాలు వంటి విశేష పర్వదినాల్లో ఈ దర్శనాలను తితిదే రద్దు చేస్తుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని తితిదే ముందుగానే ప్రకటిస్తుంటుంది.

**తిరుపతి-తిరుమలకు ప్రయాణ సదుపాయాలు**

తిరుమల, తిరుపతి శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు రోడ్డు.. రైలు.. ఆకాశ మార్గాల్లో విస్తృతమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకునే భక్తులకు స్టేషన్ ఎదురుగానే కొండపైకి తీసుకెళ్లే ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు ప్రతి నిమిషానికో బస్సు చొప్పున బ్రహ్మోత్సవాల సమయంలో నడుస్తుంటాయి. ప్రీపెయిడ్ ట్యాక్సీలు కూడా అందుబాటులో ఉంటాయి.

రేణిగుంట విమానాశ్రయం నుంచి నిత్యం మధ్యాహ్నం ఒక ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీసు నిర్వహిస్తున్నారు. ఈ బస్సు తిరుమల నుంచి ఉదయం 11 గంటలకు బయల్దేరి.. రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 12.30 నిమిషాలకు చేరుతుంది. తిరిగి విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుమలకు బయల్దేరుతుంది. విమానాశ్రయంలో ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి. తిరుపతి కేంద్రంగా ఉన్న ట్రావెల్ కంపెనీలకు సమాచారం ఇచ్చే పక్షంలో వాహనాలను సమకూర్చుతారు. అన్ని రకాల సొంత వాహనాలనూ తిరుమల వెళ్లేందుకు తితిదే అనుమతిస్తోంది. అలిపిరి భద్రతా వలయంలో తనిఖీలు నిర్వహించుకున్న అనంతరం టోల్ రుసుం చెల్లించి ఆయా వాహనాల్లో తిరుమలకు రావాల్సి ఉంటుంది. అన్ని రకాల వాహనాలు అలిపిరి నుంచి తిరుమలకు రెండో కనుమ రహదారిలో 28 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని తితిదే వేగ నియంత్రణ చర్యలు చేపట్టింది. అదేవిధంగా తిరుమల నుంచి తిరుపతికి మొదటి కనుమ రహదారిలో ప్రయాణ సమయం 45 నిమిషాలు తీసుకోవాల్సి వుంటుంది. నిర్దేశిత సమయం కంటే ముందుగా వచ్చే పక్షంలో సంబంధిత వాహనాలను తిరుమలకు 10 రోజులపాటు రాకుండా నిషేధం విధిస్తూ చర్యలు తీసుకుంటారు! రెండోసారి కూడా నిబంధనలు పాటించని పక్షంలో జరిమానా విధిస్తారు. సమయాన్ని లెక్కించడానికి అలిపిరి భద్రతావలయంలో వాహనదారులకు తితిదే బార్ కోడింగ్ రశీదులను జారీ చేస్తుంది.



**కాలినడకన వెళ్లే భక్తుల కోసం**

అలిపిరి, శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు కాలినడకన రావడానికి తితిదే అనుమతిస్తుంది. అలిపిరి నుంచి 24 గంటల సమయం, శ్రీవారి మెట్టు ల నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రవేశం కల్పిస్తుంది. గరుడోత్సవం సమయంలో 24 గంటల సమయం అనుమతించాలని నిర్ణయించింది. అడవి జంతువులను ద ృష్టిలో పెట్టుకుని శ్రీవారి మెట్టు మార్గంలో పగటి సమయంలో మాత్రమే భక్తుల రాకపోకలకు అనుమతిస్తున్నారు. వీరికి మార్గమధ్యంలో దివ్యదర్శనం టోకెన్లను తితిదే ఉచితంగా జారీ చేస్తుంది. టోకెన్లను పొందిన భక్తులకు శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పించడంతో పాటు ఒక లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తారు. రెండు లడ్డూలు కావాలంటే రూ. 10 చొప్పున రాయితీపై అందజేస్తారు. అవసరమైన వారు రూ. 25 ధరపై మరో రెండు లడ్డూలూ పొందవచ్చు. భక్తుల లగేజీని తితిదేయే తిరుమలకు ఉచితంగా చేరవేస్తుంది. అలిపిరి, శ్రీవారిమెట్టు ప్రవేశమార్గంలో ఈ ఉచిత లగేజీ రవాణా కేంద్రాలు ఉన్నాయి. అక్కడ భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసి రశీదు చూపి ఈ లగేజీని తీసుకోవచ్చు.బ్రహ్మోత్సవాల సమయంలో తితిదే ప్రత్యేక ప్రవేశ దర్శనాల టికెట్లను కరెంటు బుకింగ్ కింద ఇవ్వడాన్ని రద్దు చేస్తుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకునే ఈ నిర?యం తీసుకున్నారు. అడ్వాన్స్ బుకింగ్ కింద నిత్యం అంతర్జాలంలో 6వేలు, ఇ-దర్శన కౌంటర్ల ద్వారా మరో 5వేల టికెట్లను రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. టికెట్లలో నిర్దేశించిన సమయానికి ఆయా భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో శ్రీవారి దర్శనానికి హాజరుకావాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు, సంప్రదాయ దుస్తులు ధరించని పక్షంలో శ్రీవారి దర్శనానికి అనుమతించరు. ఒక్కో టికెట్‌పై రెండు ప్రసాద లడ్డూలు ఉచితంగా అందజేస్తారు. తిరుమలలో భక్తులందరికీ తితిదే స్వామివారి అన్నప్రసాదం అందజేస్తోంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది. ఎలాంటి సిఫార్సు లేకుండా ప్రతిఒక్కరూ ఈ అన్న ప్రసాదాన్ని ఉచితంగా స్వీకరించవచ్చు. బ్రహ్మోత్సవాల్లో రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడే భక్తులకు అల్పాహారం, పానీయాలనూ అందించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది.

**వసతి సౌకర్యం**

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటలపాటు ఉచిత వసతి కల్పిస్తారు. తితిదే ఆధ్వర్యంలో తిరుపతి-తిరుమల ప్రాంతాల్లో సుమారు 15వేల కాటేజ్‌లు భక్తుల కోసం అందుబాటులో ఉన్నాయి.

హాథీరాంజీ మఠం, జీయర్ మఠం, శంకరమఠం తదితర సంస్థల ఆధ్వర్యంలోనూ వసతి లభిస్తుంది.

ఇవికాక ఆర్జితసేవలు పొందేవారి కోసం ప్రత్యేక కాటేజ్‌లు ఉన్నాయి. అలాగే వివిధ రాష్ట్రాల టూరిజం శాఖల అతిథిగ ృహాలు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల అద్దెగదులు అందుబాటులో ఉన్నాయి. ముందస్తు రిజర్వేషన్, ఇతర వివరాలకు తితిదే కార్యాలయంలో సంప్రదించాలి

# పదే పదే..అదే అదే..


## అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్

ఒకసారి చేసిన పనిని రెండోసారి చేయాలంటేనే ఎక్కడలేని విసుగొస్తుంది. అలాంటిది రెండు కాదు, మూడు కాదు.. పది సార్లు, ఇరవై సార్లు చేయాల్సి వస్తుంటే? అదీ ఎలాంటి ప్రయోజనం లేదని తెలిసినా.. అనివార్యంగా చేయాల్సి వస్తుంటే ఇంకెంత బాధగా ఉండాలి? అడ్డూఅపూ లేని ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి చేసే అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్- ఓసీడీ సరిగ్గా ఇలాగే వేధిస్తుంది. ఒకవైపు మనసులోంచి అదేపనిగా పుట్టుకొచ్చే ఇబ్బందికరమైన ఆలోచనలు.. మరోవైపు లోపల్నుంచి ఏదో ఆదేశిస్తున్నట్టు, ఎవరో పురమాయిస్తున్నట్టు అనివార్యంగా చేయాల్సి వచ్చే పనులు.. అన్నీ కలిసి జీవితాన్ని దుర్భరం చేస్తుంటాయి. తన్నుకొచ్చే ఆలోచనల గురించి పైకి చెప్పుకోలేక.. చెబితే నవ్వుతారేమో, చిన్నచూపు చూస్తారేమోననే దిగులుతో.. ఓసీడీ బాధితులు పడే వేదన అంతా ఇంతా కాదు. దైనందిన వ్యవహారాలను సరిగా నిర్వర్తించుకోలేక.. చాదస్తపు మనిషనే హేళనలను భరిస్తూ బిక్కుబిక్కుమంటూనే ఏళ్లకేళ్లుగా రోజులు గడుపుతుంటారు. అయినా కూడా ఇదొక మానసిక సమస్యని గానీ దీన్ని వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స తీసుకుంటే మంచి ఫలితం కనబడుతుందని గానీ చాలామందికి తెలియనే తెలియదు. అందుకే ఓసీడీపై సమగ్ర వివరాలను అందిస్తోంది ఈ వారం సుఖీభవ!

సినిమాకో, షికారుకో వెళ్తున్నప్పుడు ఇంటికి తాళం సరిగా వేశామో లేదోనని ఒకటికి రెండుసార్లు లాగి చూసుకోవటం మామూలే. రాత్రిపూట సిలిండర్ కట్టేశామో లేదోనని మరోసారి చూసుకోవటం సహజమే. కానీ అనియంత్రిత ఆలోచనలు, అనివార్య చర్యలతో వేధించే అబ్సెషన్ కంపల్సివ్ డిజార్డర్ బారినపడ్డవారు ఇలాంటి పనులను అదేపనిగా.. మాటిమాటికీ చేస్తుంటారు. వీరిలో ఒకవైపు- మనసులో విపరీతమైన ఆలోచనలు పరంపరగా పుట్టుకొస్తుంటాయి (అబ్సెషన్). ఏదో ఒక ఆలోచన కావొచ్చు, దృశ్యం కావొచ్చు, సంఘటన తాలూకు జ్ఞాపకాలు కావొచ్చు.. అదేపనిగా ఆగకుండా మనసులో కదలాడుతుంటాయి. మాటిమాటికీ స్ఫురణకు వస్తూ.. చుట్టుముడుతుంటాయి. చిత్రమేంటంటే.. ఇలాంటి ఆలోచనలు మంచివి కావని ఒకపక్క వారికి తెలుస్తూనే ఉంటుంది. తమకే ఇలాంటి భావనలు ఎందుకొస్తున్నాయో, రాకుండా ఉంటే ఎంత బాగుంటుందోననీ అనుకుంటుంటారు. అయినా కూడా తన్నుకొచ్చే ఆలోచనలపై ఎలాంటి నియంత్రణా ఉండదు. ఇవి శరపరంపరగా దూసుకొస్తూ మనసును తొలుస్తూనే ఉంటాయి. మరోవె%పు- ఇలాంటి ఆలోచనలతో కమ్ముకొచ్చిన భయం, అపరాధభావం వంటివి తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంటాయి. దీన్ని తగ్గించుకోవటానికి అనివార్యంగా చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేయటం (కంపల్షన్) మొదలవుతుంది. మాటిమాటికీ స్నానం చేయటం, చేతులు కడుక్కోవటం, ఇంట్లో వస్తువులను ఒక క్రమంలో అమర్చటం, లెక్కబెట్టిన వాటిని తిరిగి లెక్కబెట్టటం వంటివన్నీ ఇలాంటివే. అయితే అందరిలోనూ ఓసీడీ ఇలాంటి అనివార్య పనులకు దారితీయాలనేమీ లేదు. కొందరిలో ఆలోచనల వరకే పరిమితం కావొచ్చు కూడా.

**ఎందుకొస్తుంది?**

ఓసీడీ ఎందుకొస్తుందో కచ్చితంగా తెలియదు. కానీ దీనికి జన్యువులు, పరిసరాలు, ఇతరులను అనుకరించటం వంటి పలు అంశాలు దోహదం చేయొచ్చు. తల్లిదండ్రులు, తోబుట్టువులు.. ఇలా రక్తసంబంధికుల్లో ఎవరైనా ఓసీడీ బాధితులు గలవారికి దీని ముప్పు ఎక్కువ. ముఖ్యంగా చిన్నవయసులోనే రక్తసంబంధికులు ఓసీడీ బారినపడి ఉంటే ముప్పు మరింత పెరుగుతుంది. కొందరు ఇతరులను అనుకరించటం వల్ల కూడా కొన్ని అలవాట్లు చేసుకోవచ్చు. ఉదాహరణకు తల్లిదండ్రులు అతిగా పూజలు చేసేవారైతే- వాళ్లు చేస్తున్నారు కదా మనం చేయకపోతే ఏమవుతుందోనని భావించి కొందరు పిల్లలు వాటికి అలవాటు పడిపోతుంటారు. మెదడులో నాడుల



మధ్య సమాచారాన్ని చేరవేసే సెరటోనిన్ స్థాయిలు తగ్గటమూ దీనికి దోహదం చేయొచ్చు. మానసికమైన ఒత్తిడితోనూ కొందరు ఓసీడీ బారినపడుతుంటారు.

**చికిత్స రెండు రకాలు**

ఓసీడీకి మందులు, ఆలోచన తీరుతెన్నులను మార్చే (కాగ్నిటివ్ బిహేవియర్) చికిత్స బాగా ఉపయోగపతాయి. కొందరికి రెండూ ఇవ్వాల్సి రావొచ్చు. వీటితో చాలావరకు మంచి ఫలితం కనబడుతుంది. అయితే చికిత్స దీర్ఘకాలం తీసుకోవాల్సి ఉంటుంది. ఆలోచనా రీతులను మార్చే చికిత్సను విడవకుండా ఇంట్లోనూ సాధన చేయాలి.

మందులు: వీటిలో ప్రధానంగా సెరటోనిన్ స్థాయులను పెంచే మందులు ఇస్తారు.

**ఆలోచనా రీతులను మార్చటం:** ఇందులో ఆలోచనలను మార్చుకోవటం, వాటిని కట్టడి చేసుకునే పద్ధతులను నేర్పిస్తారు. అలాగే భయపెడుతున్న అంశాలకు నేరుగా ప్రభావితం చేసి వాటితో ఎలాంటి ప్రమాదం లేదని గుర్తించేలా చేస్తారు కూడా. ఉదాహరణకు శుభ్రత మీద బాగా పట్టింపు గలవారిని అపరిశుభ్ర వాతావరణంలోకి తీసుకొచ్చి, చేతులు కడుక్కోకుండా కొద్దిసేపు బలవంతంగా ఆపుతారు. కడుక్కోకపోయినా ఏమీ కాలేదు కదా అని భరోసా ఇవ్వటానికి ప్రయత్నిస్తారు. దీంతో నియంత్రణ సామర్థ్యం, ధైర్యం పెరుగుతాయి. ధ్యానం, వ్యాయామం వంటివీ ఆందోళనను తగ్గిస్తూ ఓసీడీ లక్షణాలు తగ్గుముఖం పట్టటానికీదోహదం చేస్తాయి.




# వెన్ను వెదురుకర్ర!



నొప్పి ఒకటే కావొచ్చు. అది నడుంలోనే ఉండొచ్చు! కానీ అన్ని నడుంనొప్పులూ ఒకటి కాదు. శారీరక శ్రమ ఎక్కువైనప్పుడో, అడ్డదిడ్డంగా కూచోవటం వల్లనో తలెత్తే నొప్పి వేరు. ఇది విశ్రాంతి తీసుకుంటే తగ్గొచ్చు. కానీ ఒంట్లోనే పొడసూపే సమస్యలతో తలెత్తే నొప్పి వేరు. అలాంటిదే యాంకిలోజింగ్ స్పాండిలైటిస్. ఇది విశ్రాంతితో తగ్గదు సరికదా.. మరింత ఎక్కువవుతుంది! వెన్నెముకలోని పూసలను క్రమంగా దెబ్బతీస్తూ.. చివరికి వెన్నెముకను గడకర్రలానూ మార్చేస్తుంది. తలపై బరువేదో మోస్తున్నట్టుగా మెడనూ, నడుమునూ ముందుకు వంగిపోయేలా చేసేస్తుంది. దీంతో ప్రతి కదలికా భారమై.. రోజువారీ పనులు సైతం చేసుకోలేక.. పక్కలకు చూడాలన్నా శరీరం మొత్తాన్ని తిప్పాల్సిన దుస్థితికి తీసుకెళ్తుంది. దీని ఆనవాళ్లు యవ్వనదశలోనే మొదలైనా పోల్చుకోలేకపోవటం పెద్ద సమస్య. ఇది దీర్ఘకాల జబ్బు కావటం.. దీనిపై అంతగా అవగాహన లేకపోవటం మరో సమస్య. మామూలు నడుమునొప్పిగా కొందరు.. వయసుతో పాటు వచ్చే మార్పుగా మరికొందరు భావిస్తూ చేజేతులా సమస్యను తీవ్రం చేసుకుంటున్నారు. కానీ తొలిదశలోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే.. వ్యాయామాల వంటివి ఆరంభిస్తే దీన్ని చాలావరకు అదుపులో ఉంచుకోవచ్చు. అందరిలా హాయిగానూ గడపొచ్చు. అందుకే బిర్రబిగుసుకునే ఈ వెన్ను సమస్యపై సమగ్ర కథనం అందిస్తోంది ఈ వారం సుఖీభవ.

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్

నిటారుగా నిలబడతాం. ముందుకు వంగుతాం, పక్కలకు తిరుగుతాం. ఇలాంటి పనులన్నింటినీ మనం చాలా తేలికగా, అలవోకగా చేస్తున్నామంటే అదంతా వెన్నెముక చలవే. వెన్నెముకలోని పూసలు సున్నితంగా, మృదువుగా కదలటం వల్లనే. మన తల నుంచి కటి భాగం వరకూ పూసలు పూసలుగా.. ఒక దండలా ఉంటుంది వెన్నెముక. ఒక్కో వెన్ను పూసా ఒక్కో ఎముక అనుకోవచ్చు. వీటి మధ్య మందంగా, ధృడంగా ఉండే రబ్బర్ల వంటి డిస్కులుంటాయి. వీటికి అతుక్కొని ఉండే కండరబంధనాలు (లిగమెంట్లు), స్నాయువులు (టెండన్లు) పూసలు కదిలినా పక్కలకు తొలగిపోకుండా స్థిరంగా పట్టి ఉంచుతాయి. యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ సరిగ్గా వీటి మీదే దాడి చేస్తుంది. వెన్నెముకలో వాపు ప్రక్రియ (స్పాండిలైటిస్) మూలంగా పూసలు ఒకదాంతో మరోటి అతుక్కుపోవటం (యాంకిలోజింగ్) దీనిలోని ప్రత్యేకత. ముందుగా వాపు ప్రక్రియ తలెత్తిన చోట ఎముక క్షీణిస్తుంది. దీంతో శరీరం అక్కడ కొత్త ఎముకను వృద్ధి చేసి మరమ్మతు చేయటానికి ప్రయత్నిస్తుంది. ఇది నిరంతరం కొనసాగుతూ రావటం వల్ల పూసలు ఒకదాంతో మరోటి కలిసిపోతాయి. అంటే ఇటుకల మధ్య సిమెంటు వేస్తే గట్టిపడినట్టుగా అయిపోతాయన్నమాట. సమస్య తీవ్రమవుతున్నకొద్దీ- పూసలన్నీ అతుక్కుపోయి వెన్నెముక వెదురుబొంగులా (బ్యాంబూ స్పైన్) తయారవుతుంది కూడా. దీంతో కదలికలు తగ్గిపోవటం, నడుంనొప్పి వంటివన్నీ బయలుదేరతాయి. ఇది ఒక్క వెన్నెముకతోనే ఆగిపోదు. మోకాలు, మోచేయి, పాదాల్లోని కీళ్లపైనా ప్రభావం చూపుతుంది. కొందరిలో కంటి సమస్యకూ దారితీయొచ్చు.

నడుంనొప్పి తొలి లక్షణం

యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ తొలి లక్షణం నడుంనొప్పి. ముఖ్యంగా పొద్దున లేస్తూనే తీవ్రమైన నొప్పి వేధిస్తుంటుంది. ఈ నొప్పి 45 నిమిషాల నుంచి గంట వరకూ అలాగే ఉంటుంది! దీని బారినపడ్డవాళ్లు వెంటనే పక్క మీది నుంచి లేవలేరు కూడా. శరీరం కాసేపు కుదురుకున్నాకే లేస్తుంటారు. మామూలుగా నడవటానికి దాదాపు గంట సేపు పట్టొచ్చు. రాత్రిపూట పడుకున్న తర్వాత కూడా నొప్పి వేధించొచ్చు. దీంతో అర్ధరాత్రి, తెల్లవారుజామున మెలకువ వచ్చేస్తుంటుంది. వీరికి పడుకొని పక్కలకు దొర్లటమూ సాధ్యం కాదు. నడుము కదలికలు కష్టం కావటం వల్ల చేతులను పక్కవె%పులకు ఆనించి, వాటి సాయంతో నెమ్మదిగా కదులుతుంటారు. పిరుదుల్లో మార్చి మార్చి నొప్పి కనబడటం మరో ప్రత్యేకత. కొద్దిరోజులు ఎడమ పిరుదులో నొప్పి వేధిస్తే.. కొన్నాళ్లకు కుడి పిరుదులో నొప్పి తలెత్తుతుంది. కొందరిలో రెండు పిరుదుల్లోనూ నొప్పి ఉండొచ్చు.

ఎంతిసైటిస్: ఎముకతో స్నాయువులు కలిసేచోట వాపు తలెత్తటం (ఎంతిసైటిస్) మరో ముఖ్య లక్షణం. దీంతో చాలామందిలో మడమల వద్ద ఎకిలిస్ టెండన్‌లో నొప్పి పుడుతుంది. మోకాలు, మోచేతి స్నాయువుల్లోనూ వాపు తలెత్తొచ్చు. ఒకోసారి పక్కటెముకలకు అంటుకునే స్నాయువులు, కండర బంధనాలతోనూ ఒకరకమైన ఛాతీనొప్పి రావొచ్చు. దీంతో శ్వాస తీసుకోవటమూ కష్టమవుతుంది. చాలామంది దీన్ని గుండెనొప్పిగానూ పొరపడుతుంటారు.

కంటి వాపు: యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ బాధితుల్లో కనుగుడ్డు మధ్యపొరలో వాపు (యువిఐటిస్) కూడా తలెత్తొచ్చు. దీంతో కళ్లు ఎర్రబడటం, నీరు కారటం, నొప్పి, చూపు మసకబారటం వంటివి మొదలవుతాయి. నిర్లక్ష్యం చేస్తే శుక్లాలకూ దారితీయొచ్చు. అరుదుగా చూపు కూడా పోవచ్చు.

ఇతర లక్షణాలు: బరువు తగ్గటం, నిస్సత్తువ, కొద్దిపాటి జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టటం వంటివీ ఉండొచ్చు. ముఖ్యంగా తొలిదశలో ఇలాంటివి కనబడుతుంటాయి.

# చిత్రభాను

## పూరితో నా కెమిస్ట్రీ బాగా కుదిరింది



ఓ మంచి సినిమా చేసిన తర్వాత మళ్లీ ఎలాంటి కథను ఎంచుకోవాలనేది ప్రతి నటుడికి ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఇమేజ్ పట్టింపులు అడ్డుగా నిలుస్తాయి. కానీ నేను మాత్రం అలాంటి సవాళ్లను పట్టించుకోను. దర్శకుడు పూరిజగన్నాథ్‌తో సినిమా చేయాలని చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాతో మా కలయిక కుదిరింది అని అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం పైసా వసూల్. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనంద్‌ప్రసాద్ నిర్మిస్తున్నారు. పూరి జగన్నాథ్ దర్శకుడు. శ్రీయ, ముస్కాన్, కైరాదత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర ఆడియో విజయోత్సవ వేడుకను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నాన్న ఎన్టీఆర్ అందించిన ధైర్యం, ఆవేశం, స్ఫూర్తితోనే కెరీర్‌లో భిన్న నేపథ్యాలతో కూడిన సినిమాలు చేస్తున్నాను. గౌతమిపుత్రశాతకర్ణిని 79 రోజుల్లో చిత్రీకరిస్తే ఈసినిమాను మాత్రం 78 రోజుల్లోనే పూర్తిచేశాం. పరిశ్రమపై ఆధారపడి చాలా మంది బతుకుతున్నారు. అందుకే వేగంగా సినిమాలు చేస్తున్నాను. దర్శకుడు పూరి జగన్నాథ్ నిరంతరం సినిమాల గురించే ఆలోచిస్తారు. మంచి సినిమాలు చేయాలని తపిస్తుంటారు. అతడితో నా కెమిస్ట్రీ బాగా కుదిరింది. తొలుత సెప్టెంబర్ 29న సినిమాను విడుదల చేయాలని అనుకున్నాం. ఐదు వారాల ముందుగానే సెప్టెంబర్ 1న ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. ఈ సినిమాకు ముందు రైతు చేయాలని అనుకున్నాను. కుదరలేదు. అలాగే నాన్నగారి జీవిత కథపై చర్చలు జరుగుతున్నాయి అని తెలిపారు. మోహన్‌బాబు మాట్లాడుతూ బాలయ్య రికార్డుల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన సినిమాలు సిల్వర్ జూబ్లీలు, గోల్డెన్ జూబ్లీలు జరుపుకున్నాయి. గొప్ప నటుడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా నిరూపించుకున్నారు. కథలు, పాత్రల పరంగా ప్రతి సినిమాలో వైవిధ్యతను చాటుకునేందుకు తాపత్రయపడుతుంటారు. పూరిజగన్నాథ్ అంటే నాకు చాలా ఇష్టం. సినిమాల్ని వేగంగా తెరకెక్కిస్తుంటారు అని తెలిపారు. బాలయ్యతో ఇన్నాళ్లు సినిమా చేయడం కదురకపోవడంతో ఆయన్ని మిస్సయ్యాను. ఇప్పుడు షుటింగ్ పూర్తయ్యాక మళ్లీ మిస్సవుతున్నాను. క్రమశిక్షణ, అంకితభావం కలిగిన అలాంటి హీరోను ఇప్పటి వరకూ చూడలేదు అని పూరి జగన్నాథ్ చెప్పారు.ఈ కార్యక్రమంలో ఛార్మి, ఆనంద్‌ప్రసాద్, కైరాదత్, గేయరచయితలు పులగం చిన్నారాయణ , భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

## సాహసమే ఒక ఆట




గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ఆక్సిజన్. ఏ.ఎం. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ సాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్. ఐశ్వర్య నిర్మిస్తున్నారు. రాశిఖన్నా, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలు. అక్టోబర్ 12న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. నిర్మాత చిత్ర విశేషాల్ని తెలియజేస్తూ సాహసమే ఊపిరిగా బతికే ఓ ధైర్యవంతుడైన యువకుడి కథ ఇది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. గోపీచంద్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. ముంబాయి, గోవా, సిక్కింతో పాటు పలు అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపాం. దర్శకుడు జ్యోతికృష్ణ కొత్త పంథాలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. గోపీచంద్ నటన, యువన్‌శంకర్ రాజా బాణీలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో ఆడియోను విడుదల చేస్తాం అని తెలిపారు. జగపతిబాబు, కిక్‌శ్యామ్, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యుసింగ్, అమిత్, ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెట్రి, ఛోటా కె. నాయుడు, ఎడిటింగ్: ఎస్.బి. ఉద్ధవ్, సంగీతం: యువన్ శంకర్ రాజా.



## ఆనంద్..అతిశుభ్రం

అతని పేరు ఆనంద్. అతనికి ఓసీడీ వుంది. ఓసీడీ అంటే అదేదో బీటెక్, ఎంటెక్ లాంటి డిగ్రీకాదు. డిజాస్టర్. దీని లక్షణాలు అతిశుభ్రం. విపరీతమైన నీట్‌నెస్. ఇలాంటి లక్షణాలున్న ఓ యువకుడు చేసే హంగామా ఏంటో తెలియాలంటే మహానుభావుడు చూడాల్సిందే అంటున్నారు మారుతి. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం మహానుభావుడు. శర్వానంద్ కథానాయకుడు. మెహరీన్ కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని యు.వి. క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, టీజర్‌ను చిత్ర బృందం ఇటీవల విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ భలే భలే మగాడివోయ్ తరువాత నాకు నచ్చిన క్యారెక్టరైజేషన్‌తో చేస్తున్న సినిమా ఇది. రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. టీజర్ చూసినవాళ్లంతా మళ్లీ నీ పంథాలో సాగే కామెడీ ఎంటర్‌టైనర్‌లా వుందని చెబుతున్నారు. హీరో శర్వానంద్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాగా నిలుస్తుందనే నమ్మకముంది అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ క్యారెక్టరైజేషన్‌తో కామెడీని పండించగల దర్శకుల్లో మారుతి ఒకరు. టీజర్ చూస్తేనే సినిమాలో ఏ స్థాయిలో కామెడీ వుండనుందో అర్థమవుతున్నది.





## క్వీన్ రీమేక్‌లో కాజల్..



కంగనారనౌత్ కథానాయికగా నటించిన హిందీ చిత్రం క్వీన్ (2014) దక్షిణాది భాషల్లో రీమేక్ కాబోతున్న విషయం తెలిసిందే. ప్రముఖ నటుడు, దర్శకనిర్మాత త్యాగరాజన్ ఈ చిత్ర పునర్నిర్మాణ హక్కుల్ని సొంతం చేసుకున్నారు. దక్షిణాది రీమేక్‌లో ఎవరు నటిస్తారనే విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొంది. ప్రముఖ హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా క్వీన్ తమిళ రీమేక్‌లో కాజల్‌అగర్వాల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని కాజల్ స్వయంగా వెల్లడించింది. క్వీన్ చిత్రం నాకు బాగా నచ్చింది. అయితే దక్షిణాది ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నారు. హిందీలో కంగనారనౌత్ అత్యద్భుతమైన నటనను కనబరచింది. నాదైన శైలిలో సినిమాలోని పాత్రను రక్తి కట్టిస్తాననే నమ్మకముంది అని చెప్పింది కాజల్ అగర్వాల్. ఆమె తెలుగులో నటించిన నేనే రాజు నేనే మంత్రి చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో ఎమ్మెల్యే చిత్రంలో నటిస్తున్నది.

## వాలుజడ సోయగం

కబాలి చిత్రంలో రజనీకాంత్ కూతురుగా నటించిన సాయిధన్సిక ప్రధాన పాత్రలో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం రూపొందుతుంది. తమిళంలో కులలి పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తెలుగులో వాలుజడ అనే టైటిల్‌ని నిర్ణయించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల ఫస్ట్‌లుక్‌ను కథానాయిక కాజల్ విడుదల చేసింది. తమిళ దర్శకులు చేరన్, గౌతమ్‌మీనన్, విక్రమ్‌కుమార్‌ల వద్ద శిష్యరికం చేసిన రమణ మల్లం ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సింహా వాహిని చలనచిత్ర పతాకంపై సింహా వాహిని నాగరాజు ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను తెలియజేస్తూ ధన్సిక పాత్ర చిత్రానికి హైలైట్‌గా వుంటుంది. ఆమె వైవిధ్యమైన పాత్ర అందరికి కొత్త అనుభూతినిస్తుంది. శరణం గచ్ఛామి, జానకిరాముడు చిత్రాల్లో నటించిన నవీన్ సంజయ్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటి వరకు యాభై శాతం షుటింగ్ పూర్తయింది. కీలక పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు నానా పటేకర్ నటిస్తున్నారు అని తెలిపారు. యోగికత్రి, గౌతమ్‌కుమార్ , రైతుబిడ్డ నితిన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్దార్థ్ రామస్వామి, ఎడిటర్: ప్రవీణ్, సంగీతం: రథన్.

# వీళ్లిద్దరూ ఉంటేనే..

## యువరాజ్ సింగ్, సురేశ్ రైనా



న్యూఢిల్లీ: వచ్చే వన్డే వరల్డ్ కప్ వరకూ మహేంద్ర సింగ్ ధోని స్థానాన్ని భారత జట్టులో ఎవరూ భర్తీ చేయలేరని గత రెండు రోజుల క్రితం పేర్కొన్న వీరేంద్ర సెహ్వాగ్.. తాజాగా మిడిల్ ఆర్డర్ ఆటగాళ్లు యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలను కూడా వెనుకేసుకొచ్చాడు.

వచ్చే వరల్డ్ కప్‌లో భారత జట్టు సమతుల్యంగా ఉండాలంటే యువరాజ్, సురేశ్ రైనాలు ఉండాల్సిందేనని పరోక్ష హెచ్చరిక చేశాడు. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న భారత జట్టులో చోటు దక్కని యువరాజ్, రైనాల అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని వారి ఎంపికపై దృష్టి పెట్టాలన్నాడు. వారిద్దరూ మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాళ్లనే సంగతి జట్టు యాజమాన్యం తెలుసుకోవాలన్నాడు. శ్రీలంక పర్యటనకు గాను వీరి స్థానాల్లో చోటు దక్కించుకున్న మనీష్ పాండే, కేదర్ జాదవ్ లకు పెద్దగా అనుభవం లేదని విషయాన్ని ఇక్కడ మనం అంగీకరించాల్సి ఉందన్నాడు.

భారత జట్టు మిడిల్ ఆర్డర్ పటిష్టంగా ఉండాలంటే మనీష్, జాదవ్ ల అనుభవం అంతగా సరిపోదని సెహ్వాగ్ తన అభిప్రాయంగా చెప్పాడు. ఒకవేళ వచ్చే వరల్డ్ కప్ కు మనీష్, జాదవ్ లు జట్టులో ఉండాలంటే మాత్రం అప్పటికి వారిద్దరూ వంద వన్డే మ్యాచ్ లు ఆడిన అనుభవం సంపాదించుకోవాలన్నాడు. అప్పుడే వారు వరల్డ్ కప్ కు సరైన ప్రణాళికతో సిద్ధం కావడానికి ఆస్కారం ఉంటుందన్నాడు.

ఏదొక మ్యాచ్ ను బట్టి ఒక ప్రధాన ఆటగాడి ఆటను అంచనా వేయొద్దని సెహ్వాగ్ హితవు పలికాడు.

# రైల్వేకోర్టుకు ముగ్గురు మంత్రులు హాజరు



తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011లో మౌలాలిలో చేపట్టిన రైల్‌రోకో కార్యక్రమం పాల్గొన్న నేపథ్యంలో నమోదైన కేసులో రాష్ట్ర మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్, టి.పద్మారావు బోయిగూడలోని రైల్వేకోర్టుకు హాజరయ్యారు. ఈనెల 30న మళ్లీ హాజరుకావాలని జడ్జి సూచించారు.

# దత్త పుత్రికనూ వదలని గుర్మీత్!



రోహ్‌తక్: డేరా బాబా అక ృత్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తనను నమ్మిన భక్తురాళ్లనే కాదు.. దత్తత తీసుకున్న కూతురినీ గుర్మీత్ వదల్లేదని తాజాగా వెల్లడైంది. ఈ విషయం బయటకు చెప్పింది ఎవరో కాదు.. గుర్మీత్ దత్త పుత్రిక అయిన హనీప్రీత్ ఇన్సాన్ భర్త విశ్వాస్ గుప్తానే కావడం గమనార్హం. తన భార్యతో గుర్మీత్‌కు శారీరక సంబంధం ఉందని అతను చెప్పాడు. హనీప్రీత్ అసలు పేరు ప్రియాంకా తనేజా. ఆమెను 1999లో గుర్మీత్ సమక్షంలోనే పెళ్లి చేసుకున్నాడు విశ్వాస్ గుప్తా. 2011లో విడాకుల కోసం అతను దరఖాస్తు చేసుకున్నాడు. బాబా ప్రైవేట్ రూమ్‌లోకి ఓ సారి నేను వెళ్లాను. అప్పుడు నా భార్య అక్కడే ఉంది. వాళ్లు అనుకోకుండా డోర్ తెరిచే ఉంచారు. ఇద్దరూ పూర్తి నగ్నంగా ఉన్నారు. నన్ను చూసి వాళ్లు షాక్ తిన్నారు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దనీ, చెబితే చంపేస్తానని బాబా నన్ను బెదిరించాడు అని మెయిల్ టుడేతో విశ్వాస్ గుప్తా చెప్పాడు. బాబా ఎక్కడికెళ్లినా తనను, తన భార్య హనీప్రీత్‌ను వెంట తీసుకెళ్లేవాడని అతను తెలిపాడు. అయితే ప్రతిసారి తన భార్య, బాబా ఒక గదిలో నిద్రించేవాళ్లని, తాను వేరే గదిలో ఉండేవాడినని విశ్వాస్ వెల్లడించాడు. అయితే ఈ ఆరోపణలను డేరా సచ్చా సౌదా అనుచరులు మాత్రం ఖండించారు. ఆ తర్వాత ఈ ఆరోపణలను వెనక్కి తీసుకున్న గుప్తా.. కోర్టు బయటే విడాకుల అంశాన్ని పరిష్కరించుకున్నాడు.

## జైనథ్‌లో భారీ వర్షం

జైనథ్: జైనథ్ మండలంలో కురిసిన వర్షానికి కుంటలు, కాలువలు నిండిపోయాయి. సరైన సమయంలో వర్షం పడడంతో పంటలకు జీవం పోసినట్లయిందని ఓ వైపు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏకధాటిగా వర్షం కురవడంతో కూర గ్రామంలోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. 8వ వార్డులో మురుగుకాలువ సగం వరకు నిర్మించి వదిలేయడంతో మురుగునీరు ఇళ్లలోకి నీరు చేరిందని కాలనీ వాసులు పేర్కొన్నారు. వర్షం పడినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు పేర్కొన్నారు.

కాగజ్‌నగర్‌లో

పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్ సోమవారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని మురుగుకాల్వల్లోని పూడిక నిండి ఉండటం కారణంగా వర్షం నీరు రహదారులపై ప్రవహించింది. స్థానిక రైల్వేపై వంతెన సమీపంలోని గుంతల్లో వర్షం నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## స్మగ్లర్ వీరప్పన్ ప్రధాన అనుచరుడి అరెస్టు



బెంగళూరు: అడవిదొంగ, గంధపు చెక్కల స్మగ్లర్, కిల్లర్ వీరప్పన్ ప్రధాన అనుచరుడిని 25 ఏళ్ల తరువాత కర్ణాటకలోని చామరాజనగర జిల్లాలోని రామాపుర పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని సత్యమంగల తాలుకా నివాసి శివస్వామి అలియాస్ డబుల్ గుండి (52) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. స్మగ్లర్ వీరప్పన్ ప్రధాన అనుచరుల్లో శివస్వామి ఒకరు. ఇతను 25 ఏళ్ల నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. శివస్వామి మీద అనేక కేసులు ఉన్నాయి. ఇంతకాలం తప్పించుకుని తిరుగుతున్న శివస్వామి కోసం కర్ణాటక-తమిళనాడు సరిహద్దులోని రామాపురం పోలీసులు గాలిస్తున్నారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా డిజి. పుదురు గ్రామంలో శివస్వామి తలదాచుకున్నారని సమాచారం సేకరించిన రామాపురం పోలీసులు ఇతన్ని అరెస్టు చేసి స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి అనుమతితో శివస్వామిని కర్ణాటకలోని చామరాజనగర జిల్లాకు తీసుకు వచ్చారు.నిందితుడు. శివస్వామి తమిళనాడులోని ఈ రోడ్ జిల్లాలో అజ్ఞాతజీవితం గడుపుతున్నాడు.

## మిస్సైల్ ఎఫెక్ట్ మార్కెట్లు ఢమాల్

ముంబై:అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక వాతావరణం దేశీయ మార్కెట్లను ప్రభావితం చేసింది. ఆరంభంనుంచి బలహీనంగా మార్కెట్లలో ఎక్కడా కోలుకున్న ధోరణి కనిపించలేదు.

తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి కారణంగా భారీ పతనాన్ని నమోదు చేశాయి. సెన్సెక్స్ 363 పతనమై, 31387వద్ద నిఫ్టీ ,121 పాయింట్లు క్షీణించి 9782 వద్ద చేరింది. దీంతో ప్రధాన సూచీలు రెండూ కీలక మద్దతు స్థాయిలకు దిగువకు చేరాయి.

ముఖ్యంగా జపాన్ మీదుగా ఉత్తర కొరియా మిస్సైల్ ప్రయోగంతో యూరప్ మార్కెట్లు నష్టాలతో మొదలయ్యాయి. దీంతో ఆసియా మార్కెట్లు, దేశీయ మార్కెట్లు ఢమాల్ అన్నాయి. దాదాపు అన్ని రంగాలూ నీరసించగా ఐటీ, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా నష్టపోతున్నాయి. ముఖ్యంగా ఎన్‌టీపీసీ టాప్ లూజర్‌గా ఉంది.

అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌సీఎల్ టెక్, టాటా పవర్, కోల్ ఇండియా, టాటా మోటార్స్ డీవీఆర్, అదానీ పోర్ట్స్, ఇన్‌ఫ్రాటెల్, ఐబీహౌసింగ్, సన్ ఫార్మా 3-1.5 శాతం కుప్పకూలగా బీపీసీఎల్, డాక్టర్ రెడ్డీస్ మాత్రమే స్వల్ప లాభాలతో ఉన్నాయి.

# నిండా నిర్లక్ష్యం

ఆదిలాబాద్: జిల్లాలో భారత స్కౌట్స్, గైడ్స్‌కు ఆదరణ కరవవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా స్కౌట్స్, గైడ్స్ ఉండాలన్న నిబంధన ఎక్కడా కనిపించడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో అంతంతమాత్రంగానే నడుస్తోంది. విద్యార్థులను మంచి పౌరులుగా, వారిని సమాజంలో ప్రత్యేక గుర్తింపుగా తీర్చిదిద్దే ఈ విభాగం రానురాను కనుమరుగవుతోంది. దీనికి తోడు జిల్లా కేంద్రంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. అవగాహన లేక చాలా పాఠశాలల్లో అమలు కావడం లేదు. జిల్లాలో స్కౌట్స్, గైడ్స్ అభివృద్ధికి రాష్ట్ర స్కౌటర్ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు 200కు పైగా స్కౌట్స్, గైడ్స్ వలంటీర్లు ఉన్నారు. ప్రతి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ప్రజలను చె%తన్యవంతులు చేసేలా ఎన్నో కార్యక్రమాలు చేసేవారు. విభజన తర్వాత జిల్లాలో వంద వరకు మాత్రమే స్కౌట్స్, గైడ్స్ ఉన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, మోడెల్, గురుకుల పాఠశాలలు, డె%ట్ కేంద్రాల్లో తప్పనిసరిగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉచిత దుస్తులు అందజేస్తామని పేర్కొన్నారు. కానీ జిల్లాలో మాత్రం ఏ పాఠశాలల్లోనూ కనిపించడం లేదు.

**జిల్లా పరిషత్తు నిధులతో...**

జిల్లా కేంద్రంలోని విమానాశ్రయానికి వెళ్లే దారిలో స్కౌట్స్, గైడ్స్ కోసం ప్రత్యేకంగా ఎకరంన్నర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. దీంతో అక్కడ రూ.3లక్షల జడ్పీ నిధులతో 2004లో భవన నిర్మాణం చేపట్టారు. నిధులు సరిపోకపోవడంతో గుత్తేదారులు భవనాన్ని అర్థంతరంగా వదిలిపెట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే అప్పటి నుంచి ఆ భవనం చూసే నాథుడే లేక అలంకారప్రాయంగా సందర్శకులకు దర్శనమిస్తోంది. స్కౌట్స్, గైడ్స్ భవనం ముందున్న ఖాళీ స్థలంలో మందుబాబులు దర్జాగా మద్యం సేవిస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమపై చేయి చేసుకుంటున్నారని, బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఎక్కడె%తే అసంపూర్తిగా ఉన్న స్కౌట్స్, గైడ్స్ భవనాలు ఉన్నాయో వాటిని పూర్తి చేస్తామని ఎంపీ కవిత గతేడాది ప్రకటించారు.

# పోలీస్‌శాఖలో టెన్నిస్ క్రీడా కిరణం



మాదన్నపేట: ఈ ఏడాది ఆగస్టు 7 నుంచి 15 వరకు లాస్ ఏంజెల్స్‌లో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైరింగ్ గేమ్స్ తెలంగాణ పోలీసు శాఖకు ప్రత్యేకం. ఎందుకంటే తెలంగాణ

### ప్రపంచ పోలీస్, ఫైరింగ్ క్రీడల్లో రెండు కాంస్య పతకాలు

### పదో ఏట నుంచే టెన్నిస్ రాకెట్ పట్టిన బోస్‌కిరణ్

రాష్ట్రం నుంచి టెన్నిస్ క్రీడలో రెండు కాంస్య పతకాలు సాధించిన బోస్ కిరణ్ ఈ శాఖకు చెందినవాడే. హైదరాబాద్ నగరానికి చెందిన బోస్ కిరణ్ చదువుకునేటప్పటి నుంచే నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు టెన్నిస్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. అంతర్‌జిల్లా, అంతరాష్ట్ర, జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీల్లో పాల్గొని వందల పతకాలను సాధించారు. 2002లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ఉద్యోగంలో కొంత కాలం ఎస్సైగా చేరి సివిల్ ఎస్సైగా నిజామాబాద్, హైదరాబాద్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం దక్షిణమండలం, మీర్ చౌక్ డివిజన్‌కు చెందిన డబీర్‌పురా ఠాణాలో అదనపు సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రపంచ పోలీస్, ఫైరింగ్ గేమ్స్‌కు ఇటీవల అమెరికాలో 2017 ఆగస్టు 7 నుంచి 15 వరకు జరిగిన టెన్నిస్ పోటీలకు ఎంపికైన బోస్ కిరణ్ రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీల్లో మన దేశం నుంచి వెళ్లిన వారిలో తెలంగాణ నుంచి బోస్ కిరణ్, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక డీఎస్పీ, చండీగఢ్ నుంచి ఒక ఎస్పీ తదితరులు ఉన్నారు. ప్రపంచ పోలీస్, ఫైరింగ్ గేమ్స్‌లో టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో కిరణ్ కాంస్య పతకాలను అందుకున్నారు. పతకాలు సాధించి ఇటీవలే నగరానికి వచ్చిన బోస్ కిరణ్‌ను నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి, డబీర్‌పురా పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు..




## 90 మంది పేషెంట్లను చంపిన నర్సు !

*బెర్లిన్: జర్మనీలో ఓ మగ నర్సు వల్ల సుమారు 90 మందికిపైగా రోగులు చనిపోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం 40 ఏళ్ల నర్సు నీల్స్ హెగల్ జీవితకాల శిక్షను అనుభవిస్తున్నాడు. ఆరుగుర్ని చంపారన్న కేసులో రెండేళ్ల క్రితం అతనికి ఈ శిక్ష వేశారు.*

*అయితే ఈ కేసులో లోతుగా అధ్యయనం చేసిన పోలీసులు మరో వాస్తవాన్ని వెల్లడించారు. నర్సు హెగల్ వల్ల సుమారు 90 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.*

*డెల్మన్‌హోర్స్ట్, ఒల్డెన్‌బర్గ్ హాస్పటళ్లో పనిచేస్తున్నప్పుడు హెగల్ ఈ హత్యలకు పాల్పడినట్లు తెలుస్తున్నది. నిజానికి ఇంకా ఎక్కువ మంది పేషంట్లు చనిపోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. హాస్పటల్స్‌కు వచ్చిన పేషెంట్లకు హెగల్ ఇంజెక్ష ఇచ్చేవాడు. దాని వల్ల పేషెంట్ల హార్ట్ ఫెయిల్యూర్ అయ్యేది లేదా రక్తప్రసరణ నిలిచిపోయేది. ఆ తర్వాత అతను వాళ్లను కాపాడే ప్రయత్నం చేసేవాడట. రెండు హాస్పటళ్లలో పేషెంట్ల శవాలను వెలికి తీసి వాటిని పరీక్షించిన తర్వాతే పోలీసులు ఈ అంచనాకు వచ్చారు. అంతేకాదు, తాజా కోర్టు వాదనల్లో అతనీ వాస్తవాన్ని అంగీకరించాడు కూడా.*



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com